# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 110 మంగళవారం 13 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## 1024 కోట్లతో విద్యార్థులకు కానుక

**ప్రజా తపన ,పల్నాడు,**

ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న విద్యా కానుక పథకం నాలుగో విడతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. స్కూళ్లు ప్రారంభమైన తొలిరోజే విద్యాకానుక అందజేశారు. ప్రభుత్వ బడులకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లను ఇవాళ పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఏలే పరిస్థితుల్లో మన విద్యార్థులు ఉండాలి. టోఫెల్ పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థులను రెడీ చేశాం. గవర్నమెంట్ స్కూళ్లలో సీబీఎస్ఈ, ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లడేందుకు శిక్షణ ఇస్తున్నాం. బడి ప్రారంభం రోజే విద్యార్థులకు ఉచితంగా బుక్‌లు, యూనిఫాం ఇస్తున్నాం. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులకు విద్యాకానుక. రాష్ట్ర



వ్యాప్తంగా పండుగలా విద్యాకానుక జరుపుతున్నామన్నారు. బడి పిల్లలు ఓటర్లు కాదు.. అయినా జగన్ మామ వారికి కానుక ఇస్తున్నాడు. విద్యాకానుక కిట్లలో మెరుగైన మార్పులు తెచ్చాం. రూ. 1042కోట్లతో బడిపిల్లలకు కానుకలను ఇస్తున్నాం.అంతకు ముందు జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం కోసం పల్నాడు జిల్లా పెద కూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో ఓ ప్రభుత్వ స్కూలుకు వెళ్లిన సీఎం జగన్.. అక్కడి విద్యార్థులకు ము?ందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత

02

## ధర్మ పరిరక్షణ.... ప్రజా క్షేమం... సామాజిక పరివర్తన

**ఆకాంక్షిస్తూ యాగం చేపట్టిన**

**జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్.**

**ప్రజా తపన ,మంగళగిరి**

ధర్మో రక్షతి రక్షితః అనే ధార్మిక సూత్రాన్ని మనసా వాచా కర్మణా విశ్వసిస్తారు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్. ఆ క్రమంలోనే ధర్మ పరిరక్షణ, సామాజిక పరివర్తన, ప్రజా క్షేమం, ప్రకృతి విపత్తుల నివారణ, అభివృద్ధి ప్రస్థానాన్ని కాంక్షిస్తూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తలపెట్టిన యాగానికి గణపతి పూజతో స్వయంగా అంకురార్పణ చేశారు. సోమవారం ఉదయం 6గం. 55 నిమిషాలకు పవన్ కళ్యాణ్ సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు ధారణలో యాగశాలకు వచ్చి దీక్ష చేపట్టారు. ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సకల సౌభాగ్యాలతో విలసిల్లాలనే ఆకాంక్షతో దేవతామూర్తులకు ప్రణతులు అర్పించారు.

యాగశాలలో అయిదుగురు దేవతా మూర్తులను ప్రతిష్టాపించారు. స్థిరత్వం,



స్థితప్రజ్ఞత ప్రసాదిత దేవత గణపతి, శత్రు, శత్రుత్వ నిరోధిత దేవత చండీ మాత, అష్టైశ్వర్య ప్రసాదాధిపతులు శివ పార్వతులు, ఆయురారోగ్య ప్రదాత సూర్య భగవానుడు, ధార్మిక సమతుల్యత.. త్రిస్థితియుక్త కారకుడు శ్రీ మహావిష్ణువు ఈ యాగపీఠంపై పరివేష్టితులై ఉన్నారు. ఈ ఐదు దేవతా మూర్తులకు అభిముఖంగా యంత్ర స్థాపన చేపట్టారు. విగ్రహం.. యంత్రం.. హోమం ఆలంబనగా నేటి ఉదయం ప్రారంభమైన ఈ యాగం

02



### కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ టూర్ ఖరారు

**ప్రజా తపన ,హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో దూకుడుతో దూసుకుపోతోంది భారతీయ జనతా పార్టీ (బీజేపీ). రాబోయే ఎన్నికల్లో తెలంగాణ విజయ శంఖారావం పూరించాలనే లక్ష్యంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ మొదలు పెట్టింది ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. మోదీ 9 ఏండ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించేందుకు 'మహాజన్ సంపర్క్ యాత్ర'లను ఎన్నికల శంఖారావ సభలుగా మార్చుకొనేందుకు రెడీ అవుతోంది. ఈ నెలలో నిర్వహించే సభల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొననున్నారు. జూన్ 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు .విశాఖలో పర్యటించిన అమిత్ షా త్వరలో తెలంగాణ టూర్‌కు రానున్నారు. ఈమేరకు ఆయన షెడ్యూల్ విడుదల చేసింది బీజేపీ. ఈనెల 15వ తేదీన భద్రాచలంలో

02

## 15 నుంచి 17 వరకు జి 20 సమావేశాలు

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ప్రజా తపన , హైదరాబాద్**

జీ20 సమావేశాలకు సంబంధించి హైదరాబాద్ లో ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు జీ20 అగ్రికల్చర్ మినిస్టర్స్ మీటింగ్ జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశాలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారన్నారు. జీ20 దేశాలకు సంబంధించిన ప్రతినిధులు, వ్యవసాయ శాఖ



మంత్రులు ఈ సమ్మిట్ లో పాల్గొంటారన్నారు. జీ20 వర్కింగ్ గ్రూప్ సమావేశాలు భారతదేశం అధ్యక్షతన జరుగుతున్నాయి. 2022లో ఇండోనేషియాలో జరిగాయి. ఇప్పుడు మన దేశంలో జరుగుతున్నాయి. తర్వాత

02

## ఆధార్‌తో కూడా గూగుల్ పే యాక్టివేట్

**ఆధార్ కార్డ్ ఉన్నవారందరికీ**

**గూగుల్ పే కీలక సమాచారం**

**ప్రజా తపన ,న్యూ ఢిల్లీ :**

వినియోగదారులు తమ మొబైల్స్‌లో గూగుల్ పే యాక్టివేట్ చేయాలంటే డెబిట్ కార్డ్ ఉండాల్సిందే అనేది ఇప్పటివరకు ఉన్న నిబంధన. అయితే ఇకపై ఆధార్‌తో కూడా గూగుల్ పేని యాక్టివేట్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఆధార్ ఆధారిత ఐడెంటిఫికేషన్‌ను కల్పించింది. కాబట్టి వినియోగ దారులు ఆధార్‌ని ఉపయోగించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్




02

## కాలుష్య తీవ్రత అధికంగా ఉన్న సిటీల జాబితా లో హైదరాబాదే టాప్



## రాష్ట్రాలకు జీఎస్టీ వాట విడుదల చేసిన కేంద్రం

**ప్రజా తపన ,ముంబై :**

కేంద్ర ప్రభుత్వం జూన్ నెలలో వివిధ రాష్ట్రాలకు రెండు విడతల జిఎస్‌టి వాయిదాలను విడుదల చేసింది. యథావిధిగా నెలకు రూ .59,140 కోట్లు చెల్లించాల్సిన కేంద్ర ప్రభుత్వం.. ఈసారి రూ .1,18,280 కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేసింది. కేంద్ర ప్రభుత్వం జూన్ 12న ఊూ 3వ విడతను విడుదల చేసింది. రాష్ట్రాలలో వివిధ ప్రాజెక్టులకు నిధుల పెట్టుబడిని వేగవంతం చేసే ఉద్దేశ్యంతో కేంద్రం వచ్చే నెల జీఎస్టీ వాటాను ముందుగానే

02



# 1024 కోట్లతో విద్యార్థులకు కానుక

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్‌లోని ఓ తరగతి గదిలో విద్యార్థులతో కూర్చున్న సీఎం జగన్.. అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం విద్యా కానుక కిట్లను పరిశీలించారు. 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుక పంపిణీ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 43,10,165 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ. 1,042.53 కోట్ల ఖర్చుతో ఈ కిట్లను పంపిణీ చేస్తున్నారు. విద్యా కానుక కిట్‌లో ప్రతి విద్యార్థికీ ఉచితంగా ఇంగ్లీష్-తెలుగులో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, 3 జతల యూనిఫామ్ క్లాత్ కుట్టు కూలితో సహా ఇస్తున్నారు. ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు 6-10 తరగతి పిల్లలకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ, 1-5 తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన విద్యాకానుక కిట్‌ను స్కూల్ ప్రారంభమైన తొలిరోజే అందిస్తున్నారు.



### బీజేపీ సపోర్ట్ నాకు లేకపోవచ్చు- ప్రజలే నా బలం- జగన్ కీలక వ్యాఖ్యలు

వరుసగా రెండురోజులు ఇద్దరు అగ్రనేతలు ఏపీలో పర్యటించి జగన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. శ్రీకాళహస్తిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, విశాఖలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. అవినీతిమయమైపోయిందన్నారు. ఎక్కడిక్కడ మాఫియాలు రెచ్చిపోతున్నాయన్నారు. ఈ కామెంట్స్‌తో పొలిటికల్‌గా కాక రేగింది. దీనిపై వైసీపీ నుంచి ఎలాంటి కౌంటర్ వస్తుందనే ఆసక్తి అందరిలో ఉంది. క్రోసూరు సభలో మాట్లాడి సీఎం జగన్ నేరుగా బీజేపీని ఎక్కడా టార్గెట్ చేసుకోలేదు. కానీ చంద్రబాబుకు మాదిరిగా జగన్‌కు ఉండకపోవచ్చన్నారు. ప్రజలనే తాను నమ్ముకున్నానని అన్నారు. వాళ్లే తన బలం బలగమని కామెంట్స్ చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అవినీతమయమైందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. గత నాలుగేళ్లుగా ఎలాంటి అవినీతి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడమేంటని టీడీపీ ఛైర్మన్ ఆక్షేపించారు. చిత్తశుద్ధితో నడుపుతున్న ప్రభుత్వం తమదన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో జరిగిన దోపిడీ అందరికీ తెలుసు అన్నారు. ఆ దోపిడిలో బీజేపీ కూడా భాగమే అన్నారు. టీడీపీ నుంచి వెళ్లిన ఓ వర్గం నేతల ట్రాప్‌లో బీజేపీ అధినాయకత్వం పడిందన్నారు ఆయన. అందుకే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు అమిత్‌షా మాట్లాడే ముందు స్టీల్ ప్లాంట్ విషయంపై మాట్లాడాల్సి ఉందన్నారు. రెండు రోజుల క్రితం శ్రీశైలంలో పర్యటించిన బీజేపీ అధ్యక్షుడు నడ్డా కూడా వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. దీనిపై వైసీపీ నుంచి కూడా అదే స్థాయిలో కౌంటర్ పడింది. మాజీ మంత్రి పేర్ని నాని ఘాటు విమర్శలు చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఎన్ని జన్మలు ఎత్తినా ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెల్చుకోలేదని పేర్ని నాని తేల్చిచెప్పారు. కర్ణాటకలో మొన్నటివరకు ఉన్న బీజేపీ ప్రభుత్వమే అవినీతి ప్రభుత్వమని విమర్శించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక ఓటర్లు ఆ పార్టీకి తెడ్డు కాల్చి వాత పెట్టారని పేర్ని నాని ఎద్దేవా చేశారు. కర్నూలులో హైకోర్టు పెడతామని బీజేపీ హామీ ఇచ్చిందని.. ఆ హామీని టీడీపీ హయాంలో ఎందుకు అమలు చేయలేదని పేర్ని నాని ప్రశ్నించారు. అమరావతిలో జరిగిన పాపాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. ఎంపీలు సీఎం రమేష్, సత్యకుమార్, సుజనా చౌదరి మాటలను నడ్డా తన బుర్రలో ఎక్కించుకుని మాట్లాడితే అది వారి కర్మ అంటూ మాట్లాడారు.

### చంద్రబాబుపై ఘాటు విమర్శలు

పల్నాడు జిల్లా క్రోసురులో విద్యాకనుక కిట్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడిన సీఎం జగన్... చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబుది పెద్దందారీ మనస్తత్వం, వారిది పేదల వ్యతిరేక ఆలోచనలు ఉంటాయన్నారు. పేద పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు కనిపిస్తే చూడలేని వ్యక్తి చంద్రబాబు అన్నారు. వారికి ఇంగ్లీష్ మీడియం చదువులు లభించకూడదని చూసే వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. నాలుగేళ్లలో తమ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు చంద్రబాబు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు జగన్. దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళలకు తోడుగా నిలబడ్డామన్నారు. మరి గతంలో చంద్రబాబు మహిళలకు ఏం చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం తర్వాత మోసం చేశారన్నారు. రైతులకు, యువతకు, ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు, మైనార్టీలకు, ఓసీల్లోని నిరుపేదలను అందర్నీ మోసం చేశారన్నారు. చంద్రబాబు బతుకే మోసం అన్నారు. చంద్రబాబు బతుకే పెద్ద అబద్ధమన్నారు జగన్. చంద్రబాబుది పెద్దందారి మనస్తత్వం, ఈ బాబు పేదలకు వ్యతిరేకం అని మర్చిపోవద్దన్నారు. పద్నాలుగు ఏళ్లు సీఎం పోస్టులో ఉండి కూడా చంద్రబాబు పేరు చెబితే ఓ ఒక్క సంక్షేమ పథకం, మంచి గుర్తుకురాదన్నారు. వెన్నుపోట్లు, మోసం, కుట్ర, దగా మాత్రమే గుర్తుకు వస్తాయన్నారు. ఇన్ని విషయాల్లో ఇంత దారుణంగా ప్రజలను మోసం చేస్తున్నా.. అన్ని విషయాల్లో బాబును వెనుకోసుకు రావడానికి ఓ వర్గం మీడియా, దత్తపుత్రుడు మాత్రమే తోడుగా ఉన్నారు. బాబు పాలన వల్ల తమకు మేలు జరిగిందని... ఓ ప్రాంతంగానీ, సామాజిక వర్గం కానీ, పేదలు కానీ ఆయనకు తోడుగా లేరని అన్నారు. ఈ మూసేయడానికి టీడీపీ దుకాణంలో పక్క రాష్ట్రాల్లోని మేనిఫెస్టోలు తీసుకొస్తున్నారు. తమ ప్రభుత్వం అమలు చేసి చూపించిన పథకాలను కిచిడీ చేసి పులిహోరా తీసుకొస్తున్నారు. ఇన్నేళ్ల తర్వాత రాయలసీమ డిక్లరేషన్ పేరుతో మళ్లీ ప్రజలక ముందుకు వెళ్తున్నారు. పద్నాలుగేళ్లు ఏం గాడుదులు కాశారని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్ అంటూ ఇప్పుడు మొదలు పెట్టారు. ఇవాళ ప్రజలను మోసం చేస్తూ మరోసారి అధికారం ఇస్తే మయసభను నిర్మిస్తామంటున్నారు. ఇంటింటికీ కేజీ బంగారం ఇస్తామంటున్నారు. ఇంటింటికీ బెంజి కారు కూడా ఇస్తామన్నారు. ఈ కొత్త డ్రామాలు నమ్మొచ్చా అని అడుగుతున్నాను అన్నారు. కనీసం ఇప్పటికైనా చంద్రబాబు మరోసారి మోసానికి తెరతీయడం ఆపేస్తారని ఆశిద్దామన్నారు. వాగ్దనాలు, మోసం చేయడమే చంద్రబాబు సైకిల్ చక్రమన్నారు. పేదల ప్రభుత్వానికి బాబు పెద్దందారీ మనస్తత్వానికి మధ్య యుద్ధం అన్నారు.

# ధర్మ పరిరక్షణ.... ప్రజా క్షేమం... సామాజిక పరివర్తన

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం కూడా కొనసాగుతుంది. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలోని విశాల ప్రాంగణంలో రూపుదిద్దుకున్న యాగశాల ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. సనాతన ధర్మం పరిఢవిల్లుతోంది. యాగ సంప్రదాయ మేళవింపులో భాగంగా మామిడి తోరణాలు, పూలహారాలు, అరటిచెట్లు, రంగవల్లుల అలంకరణతో యాగశాల శోభాయమానంగా అలరారుతోంది. ఈ యాగం చేపట్టేందుకు ఆదివారం సాయంత్రానికే పవన్ కళ్యాణ్ యాగశాల ప్రాంతానికి చేరుకున్నారు. ఎటువంటి హడావిడి, ఆర్భాటం లేకుండా కేవలం రుత్వికులు మాత్రమే సంప్రదాయ బద్ధంగా నిర్వర్తిస్తున్న ఈ యాగం ధార్మిక చింతనను కలిగిస్తోంది.

# కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ టూర్ ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

రాములవారి దర్శనంతో షా పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. దీని కోసం ముందుగా ఈనెల 15న ఉదయం 11గంటలకు ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి కేంద్ర మంత్రి అమిత్ షా చేరుకుంటారు. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అల్పాహారానికి కేటాయించారు. ఈ సమయంలో ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 1.10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి భద్రాచలానికి బయల్దేరతారు. భద్రచలంకు చేరుకున్న తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.20 మధ్యలో రాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తర్వాత ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో బీజేపీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం సాయంత్రం 6 గంటలకు తిరిగి శంషాబాద్‌కు బయలుదేరుతారు. రాత్రి 7 గంటలకు పలువురు నేతలతో విడి విడిగా సమావేశం నిర్వహిస్తారు. రాత్రి 9.30 గంటలకు శంషాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో అమిత్‌షా ఢిల్లీకి వెళ్తారు. అయితే, తెలంగాణలో జరుగుతున్న కొన్ని కీలక పరిణాల నేపథ్యంలో కేంద్ర మంత్రి అమిత్ షాకు అధిక ప్రదాన్యత ఏర్పడింది.

# ఆధార్‌తో కూడా గూగుల్ పే యాక్టివేట్

(మొదటిపేజీ తరువాయి)

ఇండియా ద్వారా యూపీఐని రిజిస్టర్ చేసుకోవచ్చు. దీంతో డెబిట్ కార్డ్ లేకుండానే యూపీఐ పిన్‌ను సెట్ చేసుకోవచ్చని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రిపోర్ట్ పేర్కొంది. కొన్ని బ్యాంకులకు చెందిన కస్టమర్లకు ఇప్పటికే ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మిగతా బ్యాంకులు కూడా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నాయని తెలుస్తోంది. కాగా ఈ కొత్త విధానంలో పెద్ద సంఖ్యలో యూపీఐ ఐడీలు తీసుకునే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. వాళ్లంతా యూపీఐ వంటి డిజిటల్ పేమెంట్లు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందనే అంచనాలున్నాయి." ఆధార్ ఆధారిత యూపీఐ అందుబాటులోకి వస్తుండడంతో గూగుల్ పే యూజర్లు డెబిట్ కార్డ్ లేకుండానే యూపీఐ పిన్‌ను సెట్ చేసుకోవచ్చు. మరిన్ని మిలియన్ల మంది భారతీయులకు యూపీఐ పేమెంట్ సర్వీసులు చేరువవుతాయి. ఫలితంగా యూపీఐ ఐడీలు సెట్ చేసుకొని డిజిటల్ పేమెంట్లు చేస్తారు "అని గూగుల్ పే వెల్లడించింది. ఆధార్‌తో యూపీఐ యాక్టివేట్ చేయాలంటే...- యూజర్లు ఖచ్చితంగా ఏదో ఒక ప్రత్యమ్నాయాన్ని ఎంచుకోవాలి.- ఆధార్ ద్వారా యూపీఐ యాక్టివేట్ చేసుకోవాలనుకునేవారికి ఆధార్ తప్పనిసరిగా ఉండాలి.- ఫోన్ నంబర్ యూఐడీఏతో రిజిస్టర్ అయ్యుండాలి. బ్యాంకుతో కూడా మొబైల్ రిజిష్టర్ అవ్వాలి.- బ్యాంక్ అకౌంట్ - ఆధార్ అనుసంధానమయ్యుండాలి.

# రాష్ట్రాలకు జీఎస్టీ వాట విడుదల చేసిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

జోడించింది. వివిధ రాష్ట్రాలకు ఇచ్చిన రూ .1,18,280 లో కర్ణాటకకు రూ. 4,314 వచ్చింది. మహారాష్ట్ర రాష్ట్రానికి 7,472 కోట్లు వచ్చాయి. జిఎస్‌టిని అత్యధికంగా వసూలు చేసి కేంద్రానికి అందజేసే రాష్ట్రాలు మహారాష్ట్ర , కర్ణాటక. జీఎస్టీలో ఉత్తరప్రదేశ్‌లో సింహభాగం ఉంది. ఈ రాష్ట్రానికి 21,218 కోట్లు వచ్చింది. బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు జూన్ నెలలో రూ. 8,000 కోట్ల కంటే ఎక్కువ జీఎస్టీ వాటాను పొందాయి. ఉత్తరప్రదేశ్: రూ. 21,218 కోట్లుబీహార్: రూ. 11,897 కోట్లుమధ్యప్రదేశ్: రూ. 9,285 కోట్లుపశ్చిమ బెంగాల్ : రూ. 8,898 కోట్లుమహారాష్ట్ర: రూ. 7,472 కోట్లురాజస్థాన్: రూ 7,128 కోట్లుఒడిశా: రూ. 5,356 కోట్లుతమిళనాడు: రూ. 4,825 కోట్లుఆంధ్రప్రదేశ్: రూ. 4,787 కోట్లుకర్ణాటక: రూ 4,314 కోట్లుగుజరాత్: రూ 4,114 కోట్లుఛత్తీస్‌గఢ్: రూ. 4,030 కోట్లుజార్ఖండ్: రూ. 3,912 కోట్లుఅస్సాం: రూ. 3,700 కోట్లుతెలంగాణ: రూ. 2,486 కోట్లుకేరళ: రూ 2,277 కోట్లుపంజాబ్: రూ. 2,137 కోట్లుఅరుణాచల్ ప్రదేశ్: రూ. 2,078 కోట్లుఉత్తరాఖండ్: రూ. 1,322 కోట్లుహర్యానా: రూ 1,293 కోట్లుహిమాచల్ ప్రదేశ్: రూ 982 కోట్లుమేఘాలయ: రూ 907 కోట్లుమణిపూర్: రూ. 847 కోట్లుత్రిపుర: రూ. 837 కోట్లునాగాలాండ్: రూ 673 కోట్లుమిజోరం: రూ 591 కోట్లుసిక్కిం: రూ. 459 కోట్లుగోవా: రూ. 457 కోట్లు

# 15 నుంచి 17 వరకు జి 20 సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

2024లో బ్రెజిల్ లో సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలు చాలా కీలకమైనవి. ప్రపంచానికి సంబంధించి పలు అంశాలపై దిశానిర్దేశం చేసే సమావేశాలు ఇవి. భారత ప్రభుత్వం, ప్రజలు జీ20 దేశాల సమావేశాలకు ఆతిథ్యం ఇస్తున్నారు. జీ20 సమావేశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దేశంలో, ప్రపంచంలోని ప్రజలు ఈ సమావేశాలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఫాలో అవుతున్నారు.

ప్రపంచంలో కరోనా తర్వాత ఏర్పడిన అనేక రకాల సమస్యలపై చర్చించేందుకు ఈ సమావేశాలు వేదికైయాయి. రష్యా, యుక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో కూడా ప్రపంచమంతా ఆ రెండు దేశాలకు అనుకూలంగా విడిపోయాయి. భారత్ మాత్రం తటస్థంగా ఉండి చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. జీ20 సమావేశాల్లో 46 సెక్టర్లకు సంబంధించి సమావేశాలు జరుగుతాయి. 56 నగరాల్లో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 140కు మించి సమావేశాలు పూర్తయ్యాయి. జీ20 దేశాలకు ఎంత ప్రాధాన్యత ఉంది. 70 శాతం ట్రేడ్ జీ20 దేశాల నుంచే జరుగుతోంది. జీడీపీ 85 శాతం ఈ దేశాల నుంచి ఉంటుంది. 75 శాతం జనాభా జీ20 దేశాల్లోనే ఉన్నారు. మన హైదరాబాద్ కేంద్రంగా కూడా కీలకమైన రంగాలకు సంబంధించిన సమావేశాలు కొన్ని జరిగాయి.

జనవరి 28-29 తేదీల్లో జీ20 స్టార్టప్ ఎంగేజ్మెంట్ గ్రూప్ సమావేశం హైదరాబాద్ లో జరిగింది. భారతదేశంలో స్టార్టప్లకు ఉన్న ప్రోత్సాహక వాతావరణాన్ని , ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను చర్చించారు. మార్చి 6-7 తేదీల్లో హైదరాబాద్ లో ఆర్థిక శాఖకు సంబంధించిన రెండో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. గ్లోబల్ పాట్నర్షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్క్లుజన్ అంశంపై ఇందులో చర్చ జరిగింది.

ఏప్రిల్ 17 నుంచి 19 వరకు సెకండ్ డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించారు.

జూన్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడో ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. జూన్ 15 నుంచి 17 వరకు ఎంతో ముఖ్యమైన అగ్రికల్చర్ డిప్యూటీస్ సమావేశం, వ్యవసాయ శాఖ మంత్రుల స్థాయి సమావేశం హైదరాబాద్ లో జరగనుంది. ఉ20లో భాగంగా ఇప్పటి వరకు అగ్రికల్చర్ కు సంబంధించి మూడు జీ20 వర్కింగ్ గ్రూప్ మీటింగ్స్ జరిగాయి. మొదటి సదస్సు ఇండోర్లో, రెండోది చండీగఢ్లో, మూడోది వారణాసిలో జరిగింది. భాగ్యనగరంలో మూడు రోజుల పాటు జరిగే ఈ వ్యవసాయ మంత్రుల స్థాయి సమావేశాల్లో ఉ20లోని 19 సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. భారత్ తో కలిపి అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, కెనడా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, ఇటలీ, ఫ్రాన్స్ , జర్మనీ, జపాన్, కొరియా, మెక్సికో, రష్యా , సౌదీ అరేబియా, టర్కీ , యూకే, యూఎస్ఏ, యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు.

9 గెస్ట్ కంట్రీల వ్యవసాయ మంత్రులు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నెదర్లాండ్స్ , ఒమన్, నైజీరియా, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ , వియత్నాం మంత్రులు సమావేశానికి హాజరవుతారు. అలాగే 10 అంతర్జాతీయ సంస్థల హెచ్ఓడీలు హైదరాబాద్ లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఇక్రిశాట్, చిఈఖ, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్, ఆహారం మరియు వ్యవసాయ రంగ సంస్థలు, ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్, బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, అంతర్జాతీయ ఆహార విధానం పరిశోధన సంస్థం, ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రిడెవలప్మెంట్ సంస్థ, ఇఖీఎం సంస్థ, వరల్డ్ బ్యాంక్ సంస్థల ప్రతినిధులు ఈ సమ్మిట్లో పాల్గొంటారు.

ఇప్పటివరకు వరకు జరిగిన వర్కింగ్ గ్రూప్ సమావేశల్లో తీసుకున్న రిజల్యూషన్స్ మీద ఈ సమావేశాల్లో మంత్రుల సమావేశంలో మరింత లోతైన చర్చ జరుపుతారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలకు కేంద్రంగా ఉన్నటువంటి మన హైదరాబాద్ నగరంలో ఈ మంత్రుల స్థాయి సమావేశం జరగడం శుభపరిణామం. ఈ సమావేశాల్లో..

ఆహార భద్రత, పోషకాహారం కోసం సుస్థిర వ్యవసాయం మహిళల నేతృత్వంలో వ్యవసాయ అభివృద్ధి వ్యవసాయం - జీవ వైవిధ్యత వాతావరణ మార్పులను తట్టుకునేలా వ్యవసాయంలో రావాల్సిన మార్పులు అనే అంశాలపై చర్చిస్తారు. భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమపద్ధతులు, వ్యవసాయ విధానంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకునేందుకు, పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలు కూడా హైదరాబాద్ హైటెక్స్ లో సమావేశాల్లో చర్చకు రానున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఇక్రిశాట్ తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు ఇతర ప్రాంతాలను పరిశీలించనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు.

# కాలుష్య తీవ్రత అధికంగా ఉన్న సిటీల జాబితా లో హైదరాబాదే టాప్

**హైదరాబాద్:**

హైదరాబాద్ రోజు రోజు కు కాలుష్యం పెరిగిపోతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉన్న సిటీల జాబితా లో హైదరాబాదే టాప్ ప్లేస్ లో ఉందని తేలింది. గ్రీన్ పీస్ ఇండియా అనే పర్యావరణ స్వచ్ఛంద సంస్థ చేసిన తాజా అధ్యయనం లో ఈ విషయం బయట పడింది. దానికి సంబంధించిన రిపోర్టు ను ఆ సంస్థ శనివారం విడుదల చేయగా... దక్షిణాదిన బెంగళూరు చెన్నై కొచ్చి సిటీల తో పోలిస్తే హైదరాబాద్ లో పీఎం (పార్టిక్యులేట్ మ్యాటర్) 2.5 పీఎం10 కాలుష్య కారకాల స్థాయిలు అధికంగా ఉన్నట్టు తేలింది. దేశం లోని11 సిటీల్లో కాలుష్య పరిస్థితి పై ఆ సంస్థ ఆధ్యాయనం చేసింది. ఈ ఏడాది మార్చిలో ఐక్యూ ఎయిర్ రిలీజ్ చేసిన వరల్డ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ లోనూ హైదరాబాద్ లో పొల్యూషన్ తీవ్రంగా ఉన్నట్టు తేలింది. రెండు నివేదికల్లోనూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కన్నా కాలుష్య కారకాలు ఎక్కువ గానే ఉంటున్నాయని తేలింది. సిటీ లో ఏడాది పొడవునా వాయు కాలుష్యం ఉంటున్నదని నివేదిక తేలింది. 300 రోజుల పాటు అత్యంత హాని కరమైన పీఎం 2.5 కాలుష్యకారకాలు అధికంగా విడుదల వుతున్నాయి. ఒక్క క్యూ బిక్ మీటర్ గాలి లో 40.91 మైక్రోగ్రాముల మేర పీఎం 2.5 కాలుష్య కారకాలుంటున్నాయి. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రమాణాల కన్నా 8.2 రెట్లు అధికమని తేలింది. హైదరాబాద్ తో పోలిస్తే ఇతర ప్రధాన దక్షిణాది సిటీ లైన బెంగళూరు చెన్నై కొచ్చిల్లో పొల్యూషన్ తక్కువ గానే రికార్డవుతున్నట్టు రిపోర్ట్ లో వెల్లడైంది. పీఎం 2.5 స్థాయిలు బెంగళూరు లో 29.01 మైక్రోగ్రాము లు కొచ్చి లో 24.11 మైక్రోగ్రాములు చెన్నై లో 23. 81 మైక్రోగ్రాముల మేర ఉంటున్నది. ఇటు పీఎం 10 స్థాయిలు కూడా ఆయా సిటీల్లో 55.14 మైక్రోగ్రాములు 37.99 మైక్రోగ్రాములు 45.9 మైక్రోగ్రాముల మేర గాలి లో ఉంటున్నట్టు తేలింది. డబ్ల్యూహెచ్వో నిర్దేశించిన ప్రమాణాల తో పోలిస్తే ఇవి ఎక్కువే అ యినా.. హైదరాబాద్తో పోలిస్తే ఈ దక్షిణాది సిటీల్లో పొల్యూషన్ తక్కువగానే ఉన్నట్టు రిపోర్ట్ లో తేలింది.

# టీడీపీ గూటికి ఆ ముగ్గురు

**నెల్లూరు :**

2014 ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో ఉన్న పది స్థానాలను టీడీపీ కోల్పోయింది. వైఎస్ఆర్‌సీపీ విజయం సాధించింది. అయితే.. ఇప్పుడు వైసీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే వీరిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో వైసీపీ నుంచి బహిష్కరణకు గురైన ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమయింది. తెలుగుదేశంలో పార్టీలో చేరుతున్నట్టు వైసీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును ఆనం రామనారాయణరెడ్డి కలిశారు. శనివారం ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి టీడీపీ కీలక నేతలు వెళ్లారు. చర్చలు రిపారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరేందుకు ఆయన ఓకే చెప్పారు. మూడు రోజుల్లో నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించనున్న యువగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు ఆనం. అన్ని విషయాలు చర్చించామని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రపై కూడా మాట్లాడుకున్నామని వివరించారు. నెల్లూరు జిల్లాలో కీలక పరిణామాలు జరిగాయి. ఆనం రామనారాయణ రెడ్డితోపాటు మరో ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిశారు టీడీపీ నేతలు. మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, వేమిరెడ్డి పట్టాభి కలిశారు. కోటంరెడ్డి నివాసంలో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. టీడీపీలోకి రమ్మంటూ ఆహ్వానం పలికారు ఇప్పటికే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరారు. ఈ నెల 13 నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నెల్లూరు జిల్లాలో కొనసాగనుంది. ఈ క్రమంలోనే టీడీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో వైసీపీ బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. బద్వేలు నియోజకవర్గం అట్లూరులో నారా లోకేష్ యువగళం పాద యాత్రకు మేకపాటి సంఘీభావం తెలిపారు. ఈ నెల 13 న ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి యువగళం పాదయాత్ర ప్రవేశించనుంది. ఈ క్రమంలోనే లోకేష్‌తో మేకపాటి భేటీ అయ్యారు. తాను పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. వైసీపీలో తనకు టిక్కెట్ ఇచ్చేది లేదన్నారని.. ఎమ్మెల్సీ ఇస్తామన్నారని.. కానీ తానుటీడీపీలో చేరుతున్నానన్నారు. టీడీపీలో టిక్కెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా పార్టీ కోసం పని చేస్తానని ప్రకటించారు.

# ఆబ్కారీ చట్టంలో మార్పులు...

## గణనీయంగా పెరిగిన ఆదాయం

**హైదరాబాద్:**

గోవా టూర్ వెళ్లారా..? బాగా ఎంజాయ్ చేశారా..? అగ్వకు దొరుకుతాయి.. పైగా పర్మిట్ కూడా ఇస్తారు కదా.. అని ఓ రెండు బాటిళ్లు తెచ్చేసుకుందా మనుకుంటున్నారా? అయితే ఇకపై కుదరదు. రాష్ట్ర ఎక్సయిజ్?చట్టంలో ఇటీవల చేసిన సవరణల ప్రకారం ఒక్కటంటే ఒక్క మద్యం బాటిల్?కూడా గోవా నుంచే కాదు.. మరే రాష్ట్రం నుంచి ఇక్కడకు తీసుకురావటానికి వీల్లేదు. విమానంలో తెచ్చుకున్నా.. బస్సులో తెచ్చినా ఎక్సయిజ్?అధికారులు వాటిని స్వాధీనం చేసుకోవటం ఖాయం. ఇక, పెద్ద సంఖ్యలో బాటిళ్లు దొరికితే స్మగ్లింగ్?కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కేసుల్లో పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా పడే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు మాత్రం డ్యూటీ ఫ్రీ షాపు నుంచి కొన్న రెండు లీటర్ల మద్యం బాటిళ్లకు అనుమతి ఉంటుందని చెప్పారు.ఎండాకాలం వచ్చిందంటే చాలు వేలాదిమంది గోవాకు క్యూ కట్టే విషయం తెలిసిందే. దాంతోపాటు ఊటీ, కేరళ, కశ్మీర్?తదితర ప్రాంతాలకు సమ్మర్ టూర్లకు వెళ్లేవారి సంఖ్య కూడా ఎక్కువే. ఇలా వెళ్లిన వారిలో ముఖ్యంగా గోవా పర్యాటకులు తిరిగి వచ్చే సమయంలో మద్యం బాటిళ్లను కొనుక్కుని రావటం కొన్నేళ్లుగా సాగుతోంది. దీనికి కారణం కేంద్ర పాలిత ప్రాంతమైన నేపథ్యంలో ఖరీదైన బ్రాండ్లు కూడా అక్కడ చాలా తక్కువ ధరకు దొరకటం. పైగా, దేశంలోని ఏ ప్రాంతానికైనా రెండు బాటిళ్ల మద్యం తీసుకెళ్లటానికి అక్కడి వైన్?షాపులు పర్మిట్లు ఇవ్వటం. ఈ పర్మిట్ ఉంటే చాలు ఒక్కొక్కరు రెండేసి బాటిళ్ల చొప్పున గోవా నుంచి తమకిష్టమైన బ్రాండ్?మద్యాన్ని తీసుకొచ్చుకునేవారు. ఈ లెక్కన ఓ అయిదుగురు స్నేహితులు కలిసి వెళ్తే పది మద్యం బాటిళ్లు హైదరాబాద్‌కు చేరేవి. ఇలా గోవానే కాకుండా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్న వారు మన రాష్ట్రంకన్నా తక్కువ ధరలకు మద్యం దొరుకుతున్న ప్రాంతాల నుంచి బాటిళ్లు తెచ్చుకునేవారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం ఎక్సయిజ్?చట్టానికి సవరణలు చేసింది. వీటి ప్రకారం ప్రస్తుతం గోవానే కాదు ఏ రాష్ట్రం నుంచి కూడా ఒక్క మద్యం బాటిల్‌ను కూడా ఇక్కడకు తీసుకొచ్చుకోవటానికి వీల్లేదు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్?పోస్టుల్లో.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎక్సయిజ్, పోలీసు అధికారులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసి మద్యం బాటిళ్లు దొరికితే సీజ్?చేస్తున్నారు. గడిచిన రెండు నెలల్లోనే శంషాబాద్ ఎక్సయిజ్ పోలీస్ స్టేషన్ అధికారులు రెండు వందలకు పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఎక్సయిజ్ చట్టంలో చేసిన సవరణల గురించి తెలియక చాలామంది మద్యం బాటిళ్లు తెచ్చుకుని ఇక్కడ దొరికిపోతున్నారు. ఇక, మద్యం స్మగ్లింగ్‌ను అరికట్టటానికి కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఎక్సయిజ్ అధికారులు చెబుతున్నారు. కొన్ని గ్యాంగులు పక్కా ప్లాన్ల ప్రకారం మన రాష్ట్రంలో కన్నా తక్కువ ధరలకు మద్యం దొరుకుతున్న చోట్లకు వెళ్లి కార్లు, డీసీఎం వ్యాన్లు ఇలా వీలైన ప్రతీ వాహనంలో పెద్ద సంఖ్యలో మద్యం బాటిళ్లను ఇక్కడకు స్మగుల్?చేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి పెద్దమొత్తంలో గండి పడుతోందన్నారు. పైగా, మద్యం స్మగ్లింగ్?చేస్తున్న వారిలో కొందరు దానిని కల్తీ చేసి ఇక్కడ అమ్ముతున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలోనే మద్యం స్మగ్లింగ్‌ను అరికట్టటానికి అన్ని చర్యలు చేపట్టినట్టు చెప్పారు. తాము తీసుకుంటున్న ఈ చర్యల వల్ల గత రెండు మూడు నెలలుగా మద్యం స్మగ్లింగ్‌గణనీయంగా తగ్గినట్టు వివరించారు.

# లోక్‌సభ కు ముద్రగడ పద్మనాభం

**కాకినాడ :**



ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కాపు నేత ముద్రగడ పద్మనాభం అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాకినాడ నుంచి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్ పి.మిథున్‌రెడ్డితో ప్రాథమిక దఫా చర్చలు జరిపిన ముద్రగడ.. శుక్రవారం కిర్లంపూడిలోని తన నివాసంలో కాకినాడ వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగగీత, ఇతర వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలతో మరోసారి చర్చలు జరిపారు. ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నుంచి సందేశం తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు ముద్రగడకు కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తుందని ముద్రగడకు సమాచారం అందించారు ఒకవేళ ముద్రగడ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడని పక్షంలో ఆయన కుమారుడికే టిక్కెట్ ఇస్తారని పార్టీ వర్గాలు అంటున్నాయి. "తండ్రీకొడుకులు ఇద్దరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోతే, వారిలో ఒకరికి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు ఇవ్వబడుతుంది" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఆఫర్‌పై ముద్రగడ సంతోషం వ్యక్తం చేశారని, ఎంపీ లేదా ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయాలా వద్దా అనే విషయంపై తన కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని వైఎస్సార్‌సీపీ నేతలకు తెలిపినట్లు సమాచారం. గత కొంత కాలంగా ముద్రగడ వైఎస్సార్‌సీపీ నేతలతో టచ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. రాజకీయాల్లో తన భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని ఆయన ఇటీవల ప్రకటన చేశారు. పావులు కదుపుతోన్న టీడీపీ కాపు ఫ్యాక్టర్ కారణంగా గోదావరి జిల్లాల్లో బలపడుతున్న జనసేన పార్టీ ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే ముద్రగడ లాంటి ప్రముఖ కాపు నేతను పార్టీలోకి తీసుకురావడమే సరైన మార్గమని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముద్రగడ తన సొంత సీటుతో పాటు ఆంధ్రాలోని గోదావరి ప్రాంతమంతా కాపులపై ప్రభావం చూపగల సమర్థుడు.. పవన్ కళ్యాణ్‌తో పోలిస్తే కాపుల కోసం పోరాడే క్రెడిబిలిటీ ఆయనకు ఎక్కువ. కాబట్టి ఇది కచ్చితంగా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో కాపులను తనవైపు తిప్పుకోవడంలో సీఎం జగన్ తన వ్యూహాలను అమలు చేస్తూ వస్తున్నారు. అయితే కాపు సామాజిక వర్గంలో ట్రంప్ కార్డుగా ఉన్న ముద్రగడ పద్మనాభం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.

# అసలు...ధరణి లెక్కేంటీ...

## అధికార పార్టీ వాదనేంటి... ప్రతిపక్షం విమర్శ ఏంటీ

**హైదరాబాద్:**

ధరణి పోర్టల్ అంశం ఈ మధ్య గట్టిగా చర్చకు వస్తోంది. రద్దు చేస్తామని ప్రతిపక్ష అంటే? అంతా బాగానే ఉందని ప్రభుత్వం పదే పదే చెబుతుంది. నిజంగానే ధరణలో తప్పులు ఉన్నాయా?సమస్యలు పరిష్కారం కావాలంటే ఏం చేయాలనే దానిపై భూ చట్టాల నిపుణుడు సునీల్ కుమార్ అభిప్రాయాలు ఇక్కడ చూడండి? గత కొద్దిరోజులుగా తెలంగాణలో ధరణి పోర్టల్ అంశంపై గట్టిగా చర్చ వినిపిస్తోంది. ప్రతిపక్షాలతో పాటు కొన్ని ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తుండగా... అవన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే అని అంటోంది ప్రభుత్వం. ఇక తాము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని ప్రధాన ప్రతిపక్షం పదే పదే చెబుతుండగా... అలాంటి వారికి ప్రజలు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. ఈ నేపథ్యంలో అసలు ధరణిలో అంతా బాగుందా..? ధరణి పోర్టల్ లో ఉన్న ప్రధాన సమస్యలేంటి..? సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపాలి..? అసలు వాస్తవాలేంటి..?

### అసలు ధరణి ఏమిటి??

? కాగితాల నుండి కంప్యూటర్లకు ఎక్కిన భూమి/రెవెన్యూ రికార్డులే ధరణి. అప్పటి 1బి రికార్డే ఇప్పటి ధరణి.? 80వ దశకంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సి.ఎల్.ఆర్, ఆ తరువాత వచ్చిన ఎన్.ఎల్.ఆర్.ఎం.పి, ఇప్పుడు అమలులో ఉన్న డి.ఐ.ఎల్.ఆర్.ఎం.పి. పథకాలు భూమి రికార్డులను కంప్యూటరీకరించాలి అంటున్నాయి. భూమి రికార్డులు కాగితాల్లో ఉండొద్దు, కంప్యూటర్లోనే ఉండాలి అని నిర్దేశిస్తున్నాయి.? భూమి రికార్డులన్నీ కంప్యూటర్లోనే ఉండాలి. భూమి పై హక్కులు వచ్చిన వెనువెంటనే రికార్డు మారాలి. అంతిమంగా భూమి రికార్డుకు ప్రభుత్వమే హామీ ఇచ్చే వ్యవస్థ తేవాలి అనేది ఈ పథకాల లక్ష్యాలు.

? ఇందులో భాగంగా వచ్చినవే ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన 'వెబ్ ల్యాండ్', తెలంగాణ ఏర్పడిన తరువాత వచ్చిన 'మా భూమి', ఇప్పుడున్న 'ధరణి'.ధరణి – మంచి, చెడు?.

–కాగితాల్లో ఉన్న రికార్డు కంప్యూటర్ కు ఎక్కాయి. అందరికీ అందుబాటులోకి వచ్చాయి.– రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సులభతరం, వేగవంతం అయ్యాయి. ఇప్పుడు ఈ రెండు ఒకేరోజు ఒకేచోట నిమిశాల్లో అవుతున్నాయి.– ఈ రికార్డు ఆధారంగానే రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

– ధరణిలో చాలా వివరాలు తప్పుగా నమోదయ్యాయి. ఒక అంచనా ప్రకారం ప్రతి ఊరిలో వంద మందికి పైగా రైతులకు సంబంధించిన భూమి వివరాలు ధరణిలో సరిగా నమోదు కాలేదు. ధరణిలో దాదాపు 45 రకాల సమస్యలు ఉన్నాయి.– ధరణి సమస్యల పరిష్కారం క్లిష్టంగా, రైతులకు భారంగా మారింది.– భూమి రికార్డులకు ప్రభుత్వమే జిమ్మేదారిగా ఉండే, రైతులకు భూమి హక్కుల విషయం లో నష్టం జరిగితే జుర్మానా కట్టే చట్టం చేయాల్సి ఉంది.భూరికార్డుల సమస్యలు తీరాలంటే ఏం చేయాలి?

1. భూముల రీ సర్వే చేసి కొత్త రికార్డులను రూపొందించుకోవడం సమస్యకు సమగ్ర, శాశ్వత పరిష్కారం. 2. ఈ లోపు ప్రజల భాగస్వామ్యంతో ధరణిలో ఉన్న తప్పులను గుర్తించి గ్రామాలలో సదస్సులు / కోర్టులు నిర్వహించి రికార్డులను సరిచేయాలి. 3. ప్రతి సంవత్సరం జమాబందీ నిర్వహించి రికార్డుల్లో తప్పులుంటే సరిచేయాలి.

4. ధరణి, ఇతర ముఖ్యమైన భూమి రికార్డులతో కూడిన 'భూమి రికార్డుల కిట్' ను ప్రతి రైతుకు అందించాలి. 5. కంప్యూటర్ రికార్డు భూయజమానికి తెలియకుండా ఎలాంటి మార్పు జరిగే వీలులేని విదంగా రూపొందించాలి. బ్లాక్ చైనా టెక్నాలజీ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూమి రికార్డులకు భద్రత చేకుర్చాలి. 6. రైతులకు భూమి రికార్డులపై అవగాహన కల్పించాలి. 7. కాగితాల్లో ఉన్నా, కంప్యూటర్లో ఉన్నా అవి కేవలం రికార్డులు మాత్రమే. ఈ రికార్డులను వినియోగించుకునేదాన్ని బట్టే సమస్యల పరిస్కారం, హక్కుల రక్షణ ఉంటుంది. కాబట్టి, రికార్డుల కంప్యూటరీకరణతో పాటు చట్టాలలో మార్పులు, సమస్యల పరిస్కారానికి ప్రత్యేక వ్యవస్థ, మెరుగైన భూపరిపాలనకు యంత్రాంగం ఏర్పాటు జరగాలి. 8. ఒకే భూమి రికార్డు. ఆ రికార్డులో ఉన్న వివరాలకు ప్రభుత్వమే హామీ. భూయజమానికి నష్టం జరిగితే పరిహారం చెల్లింపు. ఇందుకోసం టైటిల్ గ్యారంటీ చట్టం తేవాలి. ఈరోజు ధరణి ఉంది. రేపు ఇది కొనసాగవచ్చు లేదా ఇంకోటి రావొచ్చు. ఏది ఉన్నా పైన చెప్పినవి చేస్తేనే సమస్యలు తీరతాయి భూరికార్డుల కంప్యూటరీకరణలో గడిచిన నాలుగు దశాబ్దాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఏం చేయాలో అందరు ఆలోచన చేయాలి.


# విశాఖలో రికార్డు టెంపరేచర్

**విశాఖపట్టణం:**

విశాఖపట్నం ఒక అరుదైన రికార్డుని నమోదు చేసింది. వైజాగ్ లో ఈ శతాబ్దంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యింది. నగరంలోని ముఖ్యంగా ఏర్పార్టులో 44.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నేడు మధ్యాహ్నం నమోదయ్యింది. విజయవాడ అయినా 43 డిగ్రీలు ఉంది, కానీ సముద్ర తీర ప్రాంతం పక్కనే ఉంటూ అంత ఉష్ణోగ్రత అంటే అది దాదాపుగా 55 డిగ్రీలు లాగా ఉంటుంది. రుతుపవనాలు ఆలస్యం అయితే జరిగేది ఇది. దీనికి తోడు పసిఫిక్ లో ఎల్–నినో ప్రభావం వలన వేడి అత్యధికంగా ఉంది అని ఆంధ్రప్రదేశ్ వెదర్ మ్యాన్ వెల్లడించారు. పదేళ్లలో గమనిస్తే విశాఖపట్నంలో ఉష్ణోగ్రత సరాసరి 7 డిగ్రీల మేర పెరిగింది. 2011లో గరిష్టంగా 37 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. 2012లో 37.4 డిగ్రీలు, 2013లో గరిష్టంగా 37 డిగ్రీలు, 2014లో తొలిసారి విశాఖపట్నంలో 40 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు అయింది. 2015లో 36.8 డిగ్రీలకే పరిమితమైంది. ఆపై 2016లో 36.2 డిగ్రీలు, 2017లో 35.6 డిగ్రీలు, 2018లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత, 2019లో 38 డిగ్రీలు, 2020లో 35.2 డిగ్రీలు, 2021లో 35.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తాజాగా గడిచిన 100 ఏళ్లలో అత్యధిక ఉష్ణోగ్రతను విశాఖ చూసింది. విశాఖలో 44.6 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆ తరువాత కాకినాడలో 43.2 డిగ్రీలు, విజయవాడలో 43 డిగ్రీలు, తిరుపతిలో 42.2 డిగ్రీలు, నెల్లూరులో 41.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఏపీ తీర ప్రాంత ప్రజలు ఎండల కంటే ఉక్కపోత, వడగాలులకు సతమతం అయ్యారు. గత మూడు రోజులుగా గమనిస్తే విశాఖలో సరాసరిగా 42 డిగ్రీల ఎండ దంచికొట్టింది. సాధారణ ఉష్ణోగ్రతతో పోల్చితే 11 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో విశాఖ ప్రజలు వేడి, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వడదెబ్బ కొట్టే అవకాశం ఉందని ప్రజలు నీటిని అధికంగా తాగాలని, వీలైతే పళ్ల రసాలు లాంటివి తీసుకుంటే వడదెబ్బ ప్రభావం తక్కువగా ఉంటుందని సాగర నగర ప్రజలకు వైద్యులు, అధికారులు సూచించారు.ఓవైపు కోస్తాంధ్రలో భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతుంటే, రాయలసీమను మేఘాలు కమ్మేశాయి. తిరుపతి, అన్నమయ్య జిల్లాలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడతాయని ఏపీ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోనూ తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు.

# మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు

**తిరుపతి**



సమస్య ఏదైనా అక్కడ సేవలు అందించేది పోలీసులే. ఇదే క్రమంలో చెంగాలమ్మ జాతరలో గాయపడిన ఒక అబ్బాయిని కాపాడి, మానవత్వానికి ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం పోలీసులే అనే నినాదాన్ని చాటి, ప్రజల వద్ద ప్రశంసలు పొందారు..

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో చెంగాలమ్మ అమ్మవారి జాతర అత్యంత ప్రతిష్టాత్మకంగా వైభవంగా జరుగుతుంది. ఈ జాతరను వీక్షించడానికి రాష్ట్ర నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా జనాలు తండోపతండాలుగా వస్తూ ఉంటారు. ఈ జాతర మహోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ కూడా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తుంది. తిరుపతి జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి ఐపీఎస్., పర్యవేక్షణలో భక్తులకు ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందికర వాతావరణం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని, సూళ్లూరుపేట పోలీసులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసి ఉన్నారు. వారి ఆదేశాల మేరకు నాయుడుపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి రాజగోపాల్ రెడ్డి అక్కడే ఉండి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.. ఈ క్రమంలో నిన్నటి దినం సుమారు రాత్రి అనుకొని విధంగా గాలి వాన విపరీతంగా రావడంతో కరెంటు సరఫరా లేక ఆలయ ప్రాంగణం అంతా చీకటి మయం అయిపోయింది.. అదే సమయంలో అమ్మవారి దర్శనార్థం వచ్చిన ఒక యువకుడు చిమ్మ చీకటిలో అనుకోకుండా ఫెన్సింగ్ నందు కాలు పెట్టడం వల్ల ఇరుక్కుని అతని పాదాలకు బలమైన గాయం కలిగి విపరీతంగా రక్తస్రావం అవడం వలన స్పృహ తప్పే స్థితికి వచ్చాడు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న పోలీస్ వారు గుర్తించి అధిక రక్త స్రావం జరగకుండా చూసి తమ పోలీసు వాహనంలో రక్త గాయాలతో బాధపడుతున్న అతనిని హుటాహుటిన ఒకపక్క జాతర అదే సమయంలో విపరీతమైన రద్దీ చిమ్మ చీకటి వీటన్నిటిని కూడా లెక్క చేయక ఒక గ్రీన్ ఛానల్ లాగా ఏర్పాటు చేసుకొని చికిత్స కొరకు ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు...తరలించడమే కాక దగ్గరుండి ఆ అబ్బాయి కుటుంబ సభ్యులు వచ్చేంతవరకు అతనికి సేవలందించారు.

## బైక్ ను తప్పించబోయి చెట్టును ఢీ కొన్న ఫార్చ్యూనర్

**మానకొండూరు**



రాష్ట్ర శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న 2కె రన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కౌశిక్ రెడ్డి హుజురాబాద్ కు వెల్తున్నారు. శంకరపట్నం మండలం తాడికల్ సమీపంలో రోడ్డు ప్రమాం చోటు చేసుకుంది. కౌశిక్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనానికి సమీపంలోకి బైక్ వాలా రావడంతో డ్రైవర్ ప్రమాదాన్ని నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అదుపు తప్పిన ఫార్చ్యూనర్ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. వాహనంలో బెలూన్లు ఓపెన్ కావడంతో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డితో పాటు అందులో ప్రయాణిస్తున్న వారికి భారీ ప్రమాదం తప్పినట్టయింది. అక్కడి నుండి ఎమ్మెల్సీ మరో కారులో హుజురాబాద్ కు బయలు దేరగా, స్వల్ప గాయాలైన బైక్ మీద వెల్తున్న రైతును 108లో హుజురాబాద్ ఆసుపత్రికి తరలించారు.

## తెలంగాణ రన్ కు విశేష స్పందన

**హైదరాబాద్**

తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన తెలంగాణా రన్ కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, మహమూద్ అలీ, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ లు హాజరయ్యారు. ప్రముఖ క్రీడాకారులు నిఖత్ జరీన్, ఈషా సింగ్, ప్రముఖ సింగర్ మంగ్లీ, సినీ నటి శ్రీ లీల లు హాజరయ్యారు. మంగ్లీ, రామ్ లు తమ పాటలతో రన్నర్లకు హుషారు కల్పించారు.

## కాలు జారి యువకుడు సముద్రంలో గల్లంతు

**మచిలీపట్నం**



ఫొటోలు దిగడానికి వెళ్లి అనుకోకుండా కాలుజారి సముద్రంలో పడిపోయిన హేమంత్ ఆచూకీ సోమవారం ఉదయం వరకు దొరకలేదు. స్థానిక మచిలీపట్నం పోర్ట్ పనులు శెరవేగంగా జరగుతున్న నేపథ్యంలో మచిలీపట్నం చుట్టుపక్కన ప్రాంతల ప్రజలు తపసిపూడి పోర్ట్ బెర్త్ నంబర్ . 1 దగ్గర ఫొటోలు దిగడానికి వస్తున్నారు. ఆటో డ్రైవర్ హెమంతకు కుడా కాలుజారి సముద్రంలో పడిపోయాడు. మృతుడు ఏడుగురు స్నేహితులు కలిసి ఫొటోలు దిగడానికి తపసిపూడి పోర్ట్ బెర్త్ నంబర్ .1 దగ్గరకి వెళ్లినట్లు సమాచారం. . పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పటు చెసి గాలింపు చర్యలు ముమ్మురం చేసారు

## ఘనంగా తెలంగాణ రన్



**భూపాలపల్లి**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రన్ లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భూపాలపల్లి శాసన సభ సభ్యులు గండ్ర వెంకట రమణా రెడ్డి,జిల్లా కలెక్టర్ భావేశ్ మిశ్రా,జిల్లా ఎస్ పీ సురేందర్ రెడ్డి,అడిషనల్ కలెక్టర్ దివాకర్ ,అసిస్టెంట్ కలెక్టర్ ఉమ శంకర్ ప్రసాద్,జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి. అంబెడ్కర్ స్టేడియం నుంచి పరుగుల పోటీని ప్రారంభించి,వారితో కలిసి పరుగులో పాల్గొన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెమోంటో అందించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ప్రతి ఒక్కరు సెల్ ఫోన్ మైకం లో ఉంటూ కనీస వ్యయమాన్ని చేయకపోవడం చాలా బాధాకరం. ప్రతి ఒక్కరు రోజుకు ఒక గంట వ్యాయామం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అలిశెట్టి ప్రభాకర్ కు నివాళులు

**జగిత్యాల**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాహిత్య దినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణంలో అంగడి బజార్లో ప్రముఖ సాహితీవేత్త అక్షర సూర్యుడు స్వర్గీయ అలిశెట్టి ప్రభాకర్ విగ్రహానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ పూలమాలవేసి నివాళులర్పించారు.

# మంత్రిగా బండికి ప్రమోషన్..?

**హైదరాబాద్ :**



తెలంగాణలో బీజేపీ నేతల మధ్య గొడవలను సమసిపోయేలా చేసేందుకు ఆ పార్టీ జాతీయ నాయకత్వం కసరత్తు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ అధికారమే లక్ష్యమంటున్న బీజేపీ హైకమాండ్..రాష్ట్ర పార్టీ నేతలంతా కలసికట్టుగా పనిచేసేలా చూడడంపై దృష్టి కేంద్రీకరించింది. కీలక నేతలకు కీలక బాధ్యతలు అప్పగిస్తే పార్టీ కార్యక్రమాల్లో స్పీడ్ పెరుగుతుందని, తద్వారా ఎన్నికల్లో దూసుకుపోవచ్చని భావిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీలో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సీరియస్‌గా కసరత్తు చేస్తోంది హైకమాండ్. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్‌పై కొంతకాలంగా కొంతమంది నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో ఎప్పట్నుంచో ఉన్న నేతలకు, కొత్తగా చేరిన నేతలకు మధ్య గ్యాప్ పెరిగడంతో ఈ అంతరాన్ని తగ్గించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది .బండి సంజయ్‌ను బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి నుంచి తప్పిస్తే ఆ స్థానంలోకి ఎవరు వస్తారు ..అంటే? ప్రధానంగా వినిపిస్తున్న పేరు డీకే అరుణ. ఒక వేళ బండి సంజయ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానే కొనసాగిస్తే? డీకే అరుణకు ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరో వైపు ఈటల రాజేందర్‌కు కూడా కీలక బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్‌కు బీజేపీ రాష్ట్ర ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అటు బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సునీల్ బన్సల్ ఒక్కరే ఉంటారనే టాక్ కూడా వినిపిస్తోంది. కీలకమైన ఈ మార్పు చేర్పులన్నీ నాలుగైదు రోజుల్లోనే జరగ నున్నట్లు కమలనాథుల నోట ప్రచారం జరుగుతోంది. ఈ నెల 15న ఖమ్మంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారు. ఖమ్మంలో అమిత్ షా భారీ బహిరంగసభకు ముందుగానే ఈ మార్పులు చేస్తారని తెలుస్తోంది. తెలంగాణతో పాటు 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మార్పుచేర్పులపై బీజేపీ జాతీయ నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ నాయకత్వాల్లోనే కాదు, కేంద్ర కేబినెట్‌లోనూ మార్పు చేర్పులుంటాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా అటు కేంద్ర కేబినెట్‌లో కానీ, ఇటు తెలంగాణ బీజేపీ నాయకత్వంలో కానీ సామాజిక వర్గాల సమీకరణలను పరిగణలోకి తీసుకుని మార్పులు జరగనున్నాయి.

# టీ కాంగ్రెస్ లో సీట్ల లొల్లి...

**హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ?కాంగ్రెస్‌లో టికెట్ల హడావుడి మొదలైంది. ఆశావహులు గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు. అగ్ర నాయకుల వద్ద అటెండెన్స్ కూడా వేసుకుంటున్నారు. అయితే పార్టీ కోసం పని చేసిన వారికి టికెట్లు ఇవ్వాలన్న చర్చను?సీనియర్ నేతలు తెర మీదికి తీసుకొచ్చారట. గడిచిన 10 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన జిల్లా అధ్యక్షులకు టికెట్లు ఇస్తారా..? లేదా ? అనే ప్రశ్నలు వస్తున్నాయ్. పార్టీ కోసం పని చేయండి? టికెట్లు ఇస్తామని చెప్తున్నా? పూర్తి స్థాయిలో డిసిసిలకు టికెట్లు ఇచ్చే అవకాశాలు కనిపించట్లేదు. చాలా మంది డిసిసిలు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. డీసీసీలకు టికెట్లు ఇచ్చే అంశంపై?పార్టీలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. డిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతూ?గతంలో పోటీ చేసిన వాళ్లు ఒకరిద్దరు మినహా మిగిలిన వారికి టికెట్లు ఇవ్వడం అంత ఈజీ కాదట. 35 మంది డిసిసి అధ్యక్షుల్లో?28 మందికి టికెట్లు వచ్చే అవకాశం లేదని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.జిల్లా అధ్యక్షులు నలుగురైదుగురు చాలా సీరియస్‌గా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నాయిని రాజేందర్.. వరంగల్ వెస్ట్ నియోజకవర్గం కోసం చాలా రోజులుగా పనిచేస్తున్నారు. 2018 ఎన్నికల్లోనే టికెట్ కోసం ప్రయత్నించారు. పొత్తులో భాగంగా నాయనికి టికెట్ రాలేదు. దీంతో ఈసారైనా టికెట్ వస్తుందని ఆశతో వర్కౌట్ చేసుకుంటున్నారు. మరో డిసిసి అధ్యక్షురాలు సురేఖ.. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు భార్య?మంచిర్యాల నియోజకవర్గం సీటును ఆశిస్తున్నారు. మేడ్చల్ డీసీసీ నందికంటి శ్రీధర్, వికారాబాద్ అధ్యక్షుడు పరిగి రామ్మోహన్ రెడ్డి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తహతహలాడుతున్నారట. మాజీ ఎమ్మెల్యే కోటాలో ఆయనకు టికెట్‌కు ఇబ్బంది లేదటసికింద్రాబాద్ డీసీసీ అనిల్?ముషీరాబాద్‌లో 2018 ఎన్నికల్లో పోటీ చేశారు. వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి..అంజన్‌కుమార్ యాదవ్ చేస్తారనే ప్రచారం నడుస్తోంది. ఖైరతాబాద్ డీసీసీ రోహిన్ రెడ్డి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. 2018లో టికెట్ ఆఖరి నిమిషంలో చేజారింది. ఈ సారి టికెట్ తనదేనని ప్రచారం చేసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డికి సన్నిహితుడనే పేరుంది. సిద్దిపేట డీసీసీ నర్సారెడ్డి కూడా గజ్వేల్ సీటు తనదేనంటున్నారు. డీసీసీ అయినప్పటి నుంచి నియోజకవర్గంలో కనపడటం లేదని ప్రత్యర్థులు పార్టీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మెదక్ డీసీసీ తిరుపతి రెడ్డి ఇటీవలే పీసీసీని కలిశారు. భద్రాచలం డీసీసీ, ఎమ్మెల్యే పొడెం వీరయ్య సిట్టింగ్ కాబట్టి డోకా లేదు. భువనగిరి అధ్యక్షుడు అనిల్‌కు పార్టీ హామీ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో డిసిసి అధ్యక్షులకు టికెట్లు వస్తాయా ? అధ్యక్షులకు టికెట్లు ఇవ్వాలనుకుంటే?దేన్ని పరిగణలోకి తీసుకుంటారన్న చర్చ జోరుగా సాగుతోంది. కొత్తగా పోటీ చేయాలనుకునే వారికి మాత్రం టికెట్ అంత ఈజీ కాదని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

# రైతుల ఆదాయమే.. ప్రచారస్త్రాం...

**నిజామాబాద్ :**

లంగాణలో ఎన్నికల నగారా మరికొన్ని నెలల్లో మోగనుంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు పొలిటికల్ యాక్టివిటీస్‌ని ఓ రేంజ్‌లో పెంచేశాయి. రెండు సార్లు అధికారాన్ని దక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీ సైతం ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల పేరిట రంగంలోకి దిగింది. అయితే కేసీఆర్ మాత్రం రెండు దఫాలుగా సెంటిమెంట్‌నే ప్రధాన అస్త్రంగా వాడుకున్నారు.తొలి దఫాలో తెలంగాణ సెంటిమెంట్ వర్క్ అవుట్ చేశారు. మన రాష్ట్రంలో మన పార్టీ అధికారంలో రావాలని పొలిటికల్ స్పీచ్‌ల్లో చెప్పుకుంటూ వచ్చారు. రిజల్ట్స్ సైతం కలిసొచ్చి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సీఎం పీఠంపై కేసీఆర్ కూర్చున్నారు. రెండో దఫాలో చంద్రబాబు, కాంగ్రెస్‌తో కలవడంతో మళ్లీ ఆంధ్ర వాళ్లు మనల్ని పరిపాలించాల్నా అంటూ సెంటిమెంట్ రాజేశారు. దీంతో 2018లో సైతం భారీ మెజార్టీలో అధికారంలోకి వచ్చారుఇటీవల జరిగిన వరుస బహిరంగ సభల్లో కాంగ్రెస్‌ను టార్గెట్ చేసిన కేసీఆర్ వారికి అధికారం జరిగే పరిణామాలపై రైతులకు, ప్రజలకు క్లారిటీ ఇచ్చారు. రెండు దఫాలుగా వర్క్ అవుట్ అయిన సెంటిమెంట్‌నే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఆపాదిస్తూ క్లియర్‌గా ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చారు. రైతులే టార్గెట్ వారి ఓటు బ్యాంకుపై కన్నేసిన కేసీఆర్ రుణమాఫీ విషయమై ఎక్కడా ప్రస్తావన తేవడం లేదు. కానీ రైతు బంధు, రైతు బీమా పథకాలను చూపి ఎన్నికలకు వెళ్తారని క్లారిటీ ఇస్తున్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే దళారుల భోజ్యం, దోపిడి రాజ్యం అంటూ కొత్త రాగాన్ని ఎత్తుకున్నారు. బీజేపీకి అధికారం ఇస్తే మత కల్లోలాలు జరుగుతాయని ప్రజల్లో కొత్త ఆలోచనకు తెర లేపారు.కర్ణాటక ఎన్నికల ఫలితాలతో జోష్ మీదున్న కాంగ్రెస్ పార్టీలోకి కొంత మంది కీలక నేతలు చేరేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. పొంగులేటి, జూపల్లి, తాజాగా కూచుకుళ్ల దామోదర్ రెడ్డి వంటి హస్తం పార్టీలోకి చేరేందుకు రెడీ అయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో ప్రమాదం పొంచి ఉందన్న కేసీఆర్ గేర్ మార్చారు. బీజేపీని గతంలో ఏకి పారేసిన కేసీఆర్ ప్రస్తుతం కాంగ్రెస్ పై ఫోకస్ పెంచారు. కాంగ్రెస్, బీజేపీలకు అధికారమిస్తే ఇక జరిగేది అదే అంటూ క్లియర్ పిక్చర్ చూయిస్తున్నారు.తద్వారా అవినీతి, మత కల్లోలాలు వంటి సున్నితమైన సెంటిమెంట్‌ను వాడుకుని ఈ దఫాలో సక్సెస్ కావాలని గులాబీ బాస్ భావిస్తున్నారు. తమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు లేవో చెప్పాలని రెండు పార్టీల నేతలను కార్నర్ చేస్తున్నారు. తమ విధానాలు, పథకాలు కేంద్ర పభుత్వం ఆచరిస్తుంటే ఇక వారి పాలన మనకు అవసరమా అంటూ చెబుతున్నారు. తాజా సెంటిమెంట్ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఏ మేరకు ప్లస్ అవుతుంది. ప్రజలు ఎవరి పక్షాన నిలుస్తారనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది. అయితే ఇదే కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సంస్కరణలు భేష్ అని గతంలో కామెంట్ చేయడం కొసమెరుపు.

## రన్ ఫర్ తెలంగాణ కు విశేష స్పందన

### కదం తొక్కి కదిలిన యువత....

### అభినందించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**రంగారెడ్డి**

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్ ను విద్యా మంత్రి సబితా ఇంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు.

మహేశ్వరం నియోజకవర్గం మిర్పేట్ పోలీస్ వారి ఆధ్వర్యములో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ 5కె రన్ ను జెండా ఊపిన మంత్రి, వారిలో ఉత్సాహం నింపుతూ కదం తొక్కి కదిలారు. అంతకుముందు త్రివర్ణ రంగుల బెలూన్ లను గాలిలొ వదిలి,రన్ లో పాల్గొంటున్న వారిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ అన్నారు.సమాజంలో పోలీసులు పాత్ర చాలా గొప్పదని,శాంతి భద్రతల పరిరక్షణలో వారి సేవలు ప్రశంసనీయం అన్నారు.తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా పోలీసులకు నూతన వాహనాలు, సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు.షీ టీం లు దేశానికి ఆదర్శం అయ్యాయన్నారు.సామాజిక కార్యక్రమాల్లో యువత ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు.

## 15 వరకు వడగాడ్పుల తీవ్రత

**విశాఖపట్నం**

వడగాలులతో ఉత్తరకోస్తా ఉడికిపోతుంది. వరుసగా రెండో రోజు అతి తీవ్రమైన వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ నెల 15 వరకు వడగాల్పుల తెవ్రత తప్పదని వాతావరణ శాఖా తెలిపింది.నిన్న ఉదయం నుంచి రాత్రి వరకు అదే పరిస్థితి కొనసాగింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఎక్కువ మండలాలు గాడ్పుల తీవ్రతకు నిప్పులకొలిమిని తలపించాయి. మధ్యాహ్న సమయంలో గాడ్పుల ప్రభావానికి ప్రజలు విలవిల్లాడారు. గత రెండు వారాలుగా ఎండలు పెరుగుతూనే ఉన్నాయి. వీటికి తోడు గాడ్పులు కొనసాగడంతో ఆరుబయట పనిచేసేవారు, ప్రయాణాలు చేసేవారు ఠారెత్తిపోయారు. రాత్రి సమయంలో భూమి నుంచి వేడిసెగలు వస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏసీల వినియోగం విపరీతంగా పెరిగింది. ఉత్తరకోస్తాలో పగటి ఉష్ణోగ్రతలు ఆరు నుంచి తొమ్మిది, కోస్తాలో మిగిలిన చోట్ల నాలుగు నుంచి ఏడు డిగ్రీలు, రాయలసీమలో రెండుమూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

## మైలవరం లో ఇళ్ల కూల్చివేత.. ఉద్రిక్తత

**మైలవరం**

ఎన్టీఆర్ జిల్లా మైలవరం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం బైపాస్ రింగ్ వద్ద శాంతి నగర్ లో రోడ్ల ప్రక్కన నిర్మించిన ఇళ్ళను అధికారులు సోవారం కూలగొట్టారు. తాము ఇక్కడే 30సంవత్సరాల నుండి ఉంటున్నామంటూ ఇళ్ళ యజమానులు అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టా ఇచ్చినా కూలదోస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీగా పోలీసులు మొహరించారు. అడ్డుకుంటున్న వారిని పోలీసులు నిలువరించారు. కొంతమందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## చిన్నారిపై వీధి కుక్కల దాడి

**నిజామాబాద్**

వీధి కుక్కుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. హైదరాబాద్‌లో గతంలో వీధి కుక్కల దాడిలో బాలుడు మరణించిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా ఎంతటి సంచలనం సృష్టించిదో తెలిసిందే. దీని తర్వాత అధికారులు హుటాహుటిన చర్యలు చేపట్టారు. వీధి కుక్కలను అరికట్టడానికి పలు చర్యలకు సైతం పూనుకున్నారు. అయితే దాడులు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇలాంటి ఓ దారుణ సంఘటనే కామారెడ్డి జిల్లాలో జరిగింది.కామారెడ్డి జిల్లా గాంధారి మండలంల ముదెల్లిలో మూడేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్ బయట ఆడుకుంటున్న బాలుడిపై వీది కుక్కల దాడి చేశాయి. కుక్కలు ఒక్కసారిగా మీద పడడంతో బాలుడి పొట్టభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తలపైన కూడా గాయాలు అయ్యాయి. వీధి కుక్కలు అటాక్ చేయంతో బాలుడి అరుపులు విన్న స్థానికులు అలర్ట్ అయ్యారు. వెంటనే కుక్కలను అక్కడి నుంచి తరమికొట్టారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి చికిత్స అందిస్తున్నారు. స్థానికులు సమయానికి స్పందించడంతో బాలుడికి ప్రాణాప్రాయం తప్పింది.

## చెంగాళమ్మ ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి పూజలు

**నెల్లూరు**

సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల నేపధ్యంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు, ఆలయ అధికారులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఇతర ముఖ్య నాయకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తరువాత మంత్రి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, వైసిపి ముఖ్య నాయకులు శ్రీ ఎం.అర్.సి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికలకు సిద్ధమంటున్న గడల శ్రీనివాస రావు

**ఖమ్మం:**

తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస రావు రాజకీయ ప్రవేశంపై ఎట్టకేలకు కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ అనుమతితో రాజకీయాలలోకి వస్తానని చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి తప్పకుండా వస్తానని.. అది కూడా సీఎం కేసీఆర్ అనుమతితోనే వస్తానని తెలిపారు. సీఎం కేసీఆర్ కొత్తగూడెం నుండి పోటీ చేయమని అనుమతి ఇస్తేనే తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు.కేవలం బీఆర్ఎస్ పార్టీ నుండి మాత్రమే పోటీ చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ బీ ఫామ్ ఇవ్వకుంటే వేరే ఏ పార్టీ నుండి పోటీ చేయనని చెప్పారు. తనకు ఇంకా ఏడు సంవత్సరాల ఉద్యోగ సర్వీస్ ఉంది.. పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఉద్యోగం చేసుకుంటానని వెల్లడించారు.అదేవిధంగా జీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు కొనసాగుతాయన్నారు. ఈ మేరకు హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస రావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం జనహితలో జరిగిన మీడియా చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023 ఎలక్షన్ లో కేసీఆర్ ఆదేశిస్తే కొత్తగూడెం నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని పేర్కొన్నారు. వనరులు పుష్కలంగా ఉన్న కొత్తగూడెంలో అభివృద్ధి అంతగా లేదంటూ గడల.. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు బహిరంగ లేఖను విడుదల చేశారు.

# ఈజీ మనీ కోసం... నయా దందా

**హైదరాబాద్:**

లింగనిర్ధారణ స్కానింగ్ యంత్రాలను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు వరంగల్ నగర పోలీసులు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా... దందా నడుపుతున్నట్లు గుర్తించారు. కాకతీయ యూనివర్శిటీ, దామెర పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో.... నిందితుల వద్ద నుంచి సూమారు 25 లక్షల విలువ చేసే 6 పోర్టబుల్, 12 ఫిక్సిడ్ స్కానింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మల్లివుడి అశోక్ కుమార్ (34), తాతపూడి కిరణ్ కుమార్(29) ను నిందితులుగా గుర్తించారు. ఈ ఇద్దరు అరెస్ట్ కు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) రంగనాథ్ వివరాలు వెల్లడించారు. లింగ నిర్ధారణకు పాల్పడుతూ ఈ మధ్యే అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్ ఇచ్చిన సమాచారం మేరకు వీరిద్దరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.ఈజీ మనీ కోసం అలవాటుపడి ఈ తరహా దందాకు తెరలేపినట్లు సీపీ రంగనాథ్ వెల్లడించారు. విజయవాడకు చెందిన మల్లివుడి అశోక్ కుమార్, నెల్లురుకు చెందిన తాతపూడి కిరణ్ కుమార్ ఈ మార్గం ఎంచుకున్నారని చెప్పారు. " గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్టు అయిన ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్ సమాచారం మేరకు.. వీరిద్దరి వ్యవహారం బయటికి వచ్చింది. అశోక్ కుమార్ విజయవాడలో 2012 సంవత్సరం నుంచి ఎమిలిటీ కన్సల్టెన్సీ సర్వీస్ ఇంజినీర్ ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లోని హాస్పిటల్స్‌కు చెందిన స్కానర్లు మరమ్మతులు చేయడం ద్వారా సంబంధిత డాక్టర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. అనంతరం ఆ హాస్పిటల్స్ నుంచి పాత స్కానర్లను కోనుగోలు చేయడంతో పాటు చైన్నైలో కూడా పాత స్కానింగ్ యంత్రాలను తక్కువ ధరకు కోనుగోలు చేసి వాటికి మరమ్మతులు చేసి ఎక్కువ ధరకు, అర్హతలేని వ్యక్తులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో స్కానింగ్ యంత్రాల మరమ్మతు చేసే క్రమంలో వేముల ప్రవీణ్‌తో పరిచయమై ఆయనకు అక్రమంగా ఒక స్కానింగ్ యంత్రాన్ని విక్రయించాడు. ఈ క్రమంలో ప్రస్తుతం నిందితుడి నుంచి విక్రయించదానికి సిద్ధంగా ఉన్న మరో 4 పోర్టబుల్, 11 ఫిక్సడ్ స్కానింగ్ యంత్రాలను కేయూసీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్ట్ అయిన డాక్టర్ సబిత సమాచారం మేరకు ఆమెకు అక్రమంగా స్కానింగ్ యంత్రాన్ని అమ్మిన మరో నిందితుడు తాతపూడి కిరణ్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీపీ రంగనాథ్ వివరించారు. 2018లో డేవిస్ మెడికల్ ఎక్యూప్‌మెంట్ కంపెనీ సెట్స్ మెన్‌గా పనిచేస్తూనే స్కానింగ్ యంత్రాల మరమ్మతులు చేయడం నేర్చుకున్నాడు కిరణ్ కుమార్. 2021లో కావలి ప్రాంతంలో శ్రీపవిత్ర టెక్నాలజీశ్రీ పేరుతో స్కానింగ్ సర్వీసు సెంటర్ ఏర్పాటు చేసి వివిధ హాస్పిటల్స్ లోని స్కానింగ్ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. హనుమకొండకు వచ్చిపోయే క్రమంలో డాక్టర్ సబితతో పరిచయం ఏర్పడి ఆమెకు అనుమతులు లేకుండా రూ. లక్షకు స్కానింగ్ యంత్రాన్ని విక్రయించినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతని నుంచి మరో రెండు పోర్టబుల్ , ఒక ఫిక్సడ్ స్కానింగ్ యంత్రాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ పేర్కొన్నారు.

# నారా లోకేష్ పాదయాత్రలో జేబు దొంగలు

**బద్వేలు**



బద్వేల్ నియోజకవర్గం లో శనివారం నుంచి జరుగుతున్న నారా లోకేష్ పాదయాత్రలో జేబు దొంగలు ఎక్కువయ్యారు. పలువురి జేబులు కొట్టేసి వేల రూపాయలు దొంగలించారు. పాదయాత్రకు ఎందుకు వచ్చామని బాధితులు వాపోతున్నారు. పలువురి జేబులు కొట్టేసి నగదు దోచుకున్నట్లు పార్టీ నాయకులే చెబుతున్నారు. మరికొందరి నగదు కూడా స్వా చేశారు ఇంకొందరి ద్విచక్ర వాహనాలు దొంగలు ప్రయత్నాలు కూడా జరిగినట్లు సమాచా.రం ఏదైనా పెద్ద కార్యక్రమాలు జరిగేటప్పుడు ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. గతంలో కూడా ఇలాంటి దొంగతనాలు చాలా జరిగాయి. ఇలాంటి కార్యక్రమాలు జరిగేటప్పుడు జేబు దొంగలు పనిగట్టుకుని వస్తూ ఉంటారు. నగదు పోగొట్టుకున్న వారు ఇప్పుడు లబోదిబో అంటున్నారు. ఇంటి ఖర్చులకోసం ఇతర పనుల కోసం పెట్టుకున్న నగదు దొంగల పాలు కావడంతో ఎవరు చెప్పుకోవాలో తెలియక మౌనంగా బాధపడుతున్నారు

# ఎన్నికల వేళ పార్టీలు...వ్యూహాలు... ప్రతివ్యూహాలు

**హైదరాబాద్:**

తెలంగాణలో ఎన్నికల సమీపిస్తున్న వేళ గులాబీ బాస్ కేసీఆర్ వ్యూహం మార్చినట్లు కనిపిస్తోంది. మొన్నటి వరకు బీజేపీని ఓ రేంజ్ లో టార్గెట్ చేస్తూ వచ్చిన ఆయన...ప్రస్తుతం అలాంటి దానికి కనీసం కూడా స్కోప్ ఇవ్వటం లేదు. ఇదీ కాస్త తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. కేసీఆర్..... వ్యూహాలు రచించటంలో దిట్ట..! ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ... ప్రత్యర్థి పార్టీలను ఈజీగా బోల్తా కొట్టించేస్తారు..! సూటిగానే పదునైన మాటలతో... టార్గెట్ చేసి ఏకిపారేస్తారు.. ! కాస్త సైలెన్స్ గా ఉన్నారంటే... ఏదో మాస్టర్ స్కెచ్ తో ముందుకువస్తారన్నట్లు ఉంటుంది ఆయన తీరు..! ఆయన తీసుకొనే కొన్ని నిర్ణయాలు కూడా ఎవరికీ అర్థం కాకుండా ఉంటాయి..! సీన్ కట్ చేస్తే త్వరలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల పర్యటనకు వెళ్తున్న ఆయన... బీఆర్ఎస్ పాలనను చెబుతూనే ప్రతిపక్షాలపై స్వరం పెంచుతున్నారు. అయితే ఆయన ప్రస్తావిస్తున్న తీరు కూడా చాలా వ్యూహాత్మకంగా ఉందన్న చర్చ మొదలైంది. ఇప్పుడు ఇదే తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ గా మారింది.కర్ణాటక ఫలితాల తర్వాత తెలంగాణలోనూ రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. అప్పటి వరకు బీజేపీ దూకుడు మీద ఉండగా... ఈ ఫలితాల తర్వాత కాంగ్రెస్ తెగ స్పీడ్ తో లైన్ లోకి వచ్చేసింది. బీజేపీలోకి చేరికలకు బ్రేక్ లు పడ్డాయి. పార్టీ మారే నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇక కాంగ్రెస్ హైకమాండ్ కూడా నెక్ట్స్ టార్గెట్ తెలంగాణే అని చెబుతోంది. ఇక రాష్ట్ర నాయకత్వం కూడా కేసీఆర్ పాలనపై దూకుడుగా ముందుకెళ్తోంది. ధరణి, డబుల్ బెడ్ రూమ్ తో పాటు పలు కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే పనిలో ఉంది. ఓవైపు డిక్లరేషన్లను ప్రకటిస్తూ... ఎన్నికల మేనిఫెస్టోపై కూడా కసరత్తు చేస్తోంది. ఓ రకంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ అన్న పరిస్థితిని మళ్లీ తీసుకురాగల్గింది. అయితే తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వస్తున్న కేసీఆర్... గేర్ మార్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల పలు జిల్లాల్లో పర్యటించిన కేసీఆర్... ఆయా సభల్లో కేవలం కాంగ్రెస్ ను మాత్రమే టార్గెట్ చేశారు. కనీసం బీజేపీ ప్రస్తావన తీసుకురావటం లేదు. ధరణితో పాటు పలు అంశాలను ప్రస్తావిస్తున్న కేసీఆర్.... కాంగ్రెస్ కు అవకాశం ఇస్తే ఏం జరుగుతుందో ఆలోచించాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. ఈ పరిణామం కాస్త.... రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఓ రకంగా బీజేపీ సైడ్ ట్రాక్ లోకి వెళ్లిపోయిందన్న చర్చ ఊపందుకుంటున్న నేపథ్యంలో.... కేసీఆర్ పదే పదే హస్తం పార్టీని కార్నర్ చేస్తుండటం ఇందుకు బలం చేకూరుస్తున్నట్లు అయిందివచ్చే ఎన్నికల్లో తమ ప్రత్యర్థి ఎవరనే దానిపై పక్కా అంచనాతో కేసీఆర్ ఉన్నారని తెలుస్తోంది. బీజేపీ ప్రభావం రాష్ట్రంలో ఉండదని... కాంగ్రెస్ పార్టీతోనే తమ పోటీ అన్న విషయాన్ని కేసీఆర్ కూడా పరోక్షంగా వ్యక్తపరుస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ను కార్నర్ చేస్తుండగా... రాబోయే రోజుల్లో కూడా మరింత దూకుడు పెంచే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా... బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తోంది.మొత్తంగా ఎన్నికల టైం దగ్గర పడుతున్న వేళ.... ప్రధాన పార్టీలన్నీ వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచించే పనిలో పడ్డాయి. ఇదే నెలలో బీజేపీ అగ్రనేతలు కూడా తెలంగాణలో పర్యటించబోతున్నారు. తాజా పరిస్థితుల దృష్ట్యా... పార్టీపరంగా కీలక మార్పులు చేసే విషయంపై ఆలోచిస్తోంది. అలాంటి పరిమామాలే చోటు చేసుకుంటే.... స్టేట్ పాలిటిక్స్ మరింత హీట్ ఎక్కే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో కూడా కేసీఆర్ ఇదే వైఖరి అనుసరిస్తారా..? బీజేపీని కూడా కార్నర్ చేస్తారా..? లేక ఇంకా ఏదైనా స్ట్రాటజీని అమలు చేస్తారా?? అనేది చూడాలి?.!

# ప్రతిభకు ప్రశంసా పురస్కారం



**శ్రీ కాళహస్తి**


తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత సంవత్సరం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో సాంకేతిక సహకారం అందిస్తూ, విశేష సేవలందించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటిడిపి కార్యకర్తలను నారా చంద్రబాబు నాయుడు ప్రశంస పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు గత సంవత్సరం తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సాంకేతిక సహకారం అందించి, శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దిశానిర్దేశంలో సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటిడి కార్యకర్తలు సాగర్ కృష్ణ, చింత గింజల సునీల్, షేక్ ఖాదర్ లను నిన్నటి రోజు మంగళగిరి లోని, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారు మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడంలో, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో ఐటిడిపి విభాగానిది అత్యంత కీలకపాత్ర అని ప్రశంసించారు.రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి తమ శక్తి మేర కృషి చేసి, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుధీర్ రెడ్డి ని గెలిపించు కుంటామని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటిడిపి నాయకులు సాగర్, సునీల్, ఖాదర్ లు పేర్కొన్నారు.

# నా కొడుకు చావుకు అప్సర,ఆమె తల్లి కారణం

**కార్తీక్ రాజా తల్లి ధనలక్ష్మి ఒక ఆడియోను విడుదల**

**హైదరాబాద్ :**





అప్సర హత్య కేసులో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. అప్సరకు ఇప్పటికే పెళ్లి అయినట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అలాగే సోషల్ మీడియాలోనూ అందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. అప్సర, చెన్నైకి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ కార్తీక్ రాజాను ప్రేమ వివాహం చేసుకుందని ప్రచారం నడుస్తోంది. ఆ తర్వాత కొంత కాలానికే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని కూడా సమాచారం.ఆ ఆరోపణలకు ఊతమిచ్చేలా ఓ ఆడియో వైరల్‌గా మారింది. అప్సర పెళ్లి చేసుకున్న వ్యక్తి తల్లి పేరుతో ఓ ఆడియో నెట్టింట తిరుగుతోంది. తన కుమారుడిని అప్సర మానసికంగా వేధించడం వల్లే కార్తీక్ రాజా ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తల్లి ధనలక్ష్మి చెబుతోంది. పెళ్లైన కొద్ది రోజులకే లగ్జరీగా బతకాలని, టూర్లకు తీసుకెళ్లాలంటూ అప్సర, ఆమె తల్లి అరుణ వేధింపులకు గురి చేశారని వివరించారు. ఈ క్రమంలోనే తల్లీకూతుర్లు ఇద్దరూ తన కొడుకుతో గొడవ పడేవారని చెప్పారు. గొడవలు మరింత ఎక్కువయ్యాక పోలీస్ స్టేషన్ లో తన కుమారుడిపై కేసు కూడా పెట్టారని చెప్పారు. అది తట్టుకోలేకే కార్తీక్ మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. తన కుమారుడి చావుకు అప్సర, ఆమె తల్లి అరుణనే కారణం అని చెప్పుకొచ్చారు. తన కుమారుడి ఆత్మహత్య తర్వాత వారిద్దరూ కనిపించకుండా పోయారని... అప్సర హత్యకు గురైందని మీడియాలో వార్తలు చూసి తెలుసుకున్నట్లు ధనలక్ష్మి తెలిపారు. వారిద్దరూ హైదరాబాద్ లో ఉంటున్న వార్త కూడా తమకు తెలియదు.. అప్సరకు సినిమాల్లో నటించాలని కోరిక ఉండేదని.. అందుకోసమే వాళ్లు హైదరాబాద్ కు వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నట్లు కార్తీక్ రాజా తల్లి ధనలక్ష్మి తెలిపారు. అప్సర తల్లి కూడా ఈ వార్తలపై స్పందించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కూతురు చనిపోయిందని.. ఆ బాధలో నుంచి ఇప్పటికీ తమ కుటుంబం బయటకు రాలేకపోతుందని చెప్పారు. హంతకుడు సాయికృష్ణ కుటుంబ సభ్యులు కావాలనే తమ కూతురిపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తన కూతురు ఆత్మకు శాంతి కల్గకుండా చేస్తున్నారని వాపోయారు. కూతురు చనిపోయిన బాధలో తాము ఉంటే.. తమ పరువును బజారుకు ఈడ్చే పనులు చేయడం ఏంటని అరుణ ప్రశ్నించారు. అయితే అప్సరకు గతంలోనే వివాహం జరిగినట్లు నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలు చూసి అరుణ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సరూర్‌నగర్ ప్రాంతంలో జరిగిన అప్సర హత్య కేసు సంచలనంగా మారింది. వెంకట సాయికృష్ణ, అప్సర ఒకే వీధిలో ఉండేవారు. సాయికృష్ణకు ఇప్పటికే వివాహమై ఓ పాప కూడా ఉంది. అయితే.. అప్సరతో సాయికృష్ణ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటికే ఒకసారి ఆమె గర్భం దాల్చడంతో సాయికృష్ణ అబార్షన్ చేయించాడు.. తాజాగా అప్సర మరోసారి గర్భం దాల్చడంతో పెళ్లి చేసుకోవాలని గత రెండు నెలలుగా సాయి పై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నది. దీంతో ఆమెనుంచి తప్పించుకునేందుకు హత్య చేయాలని నిర్ణయించుకుని పక్క ప్లాన్ సిద్ధం చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. అప్సరను హత్య చేసిన తర్వాత అదే కారులో తీసుకొని ఇంటికి వచ్చిన సాయి.. డెడ్ బాడీని కారులోనే పెట్టి ఒక రోజు మొత్తం ఇంటి ముందే పార్క్ చేశాడు. మరుసటి రోజున డెడ్ బాడీ తీసుకువెళ్లి మ్యాన్ హోల్ లోంచి కిందికి పడేశాడు. మ్యాన్‌హోల్‌లో డెడ్ బాడీ వేసిన తర్వాత అందులో మట్టిని నింపాడు. మ్యాన్‌హోల్ నుంచి దుర్వాసన వస్తుందని మట్టి నింపుతున్నట్లు అందర్నీ నమ్మించాడు. ఎవరికి అనుమానం రాకుండా ఉదయం సమయంలో మ్యాన్‌హోల్‌లో మట్టిని నింపించాడు. అప్సర కనిపించకపోవడంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. అప్సర కోసం పోలీసులతో పాటు నిందితుడు సాయి కూడా అన్నిచోట్ల వెతికాడు. పోలీసులు సీసీ కెమెరాలతో పాటు సెల్‌ఫోన్ ట్రాక్ రికార్డును పరిశీలించారు. సాయి, అప్సర సెల్ ఫోన్లు మరుసటి రోజు ఒకే దగ్గర ఉండడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. గురువారం రోజున సాయిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు నిజం బయటపడింది.

# మల్లయ్యమహర్షిని సత్కరించిన జిల్లాకలెక్టర్

**కమాన్ పూర్**



రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దశాబ్ద ఉత్సవాలు ముప్పై మూడు జిల్లాల్లో నిర్వహిస్తున్న కవిసమ్మేళనంలో భాగంగా నిర్వహించిన పెద్దపల్లి జిల్లా సాహిత్య దినోత్సవ కవిసమ్మేళనం పెద్దపల్లి ఆర్ ఆర్ గార్డెన్ లొ జిల్లాకలెక్టర్ శ్రీమతి సంగీత సత్యనారాయ ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో "ప్రగతి ఫలాలు' శీర్షికన కవితాగానం చేయగ, పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామ నివాసి ప్రముఖ రైతు,కవి, రచయిత, సామాజిక కార్యకర్త, డెమోక్రటిక్ జర్ణలిష్ట్ ఫెడెరేషన్ రాష్ట్ర కార్యదర్శి, కూచన.మల్లయ్య మహర్షిని ముఖ్య అతిథిది పెద్దపల్లిజిల్లా కలెక్టర్ శ్రీ మతి సంగీత సత్యనారాయణ చేతుల మీదుగ వేయినూట పదహారు రూపాయలు బహుమతి ప్రశంసా పత్రంపత్రం యిచ్చి శాలువతో సత్కరించి అభినం దించారు.ఈసందర్భంగాజరిగిన కార్యక్రమంలొ పెద్దపల్లిజిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ కుమార్ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి ఎంల్యె దాసరి మనోహర్ రెడ్డి రామ గుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జిల్లా గ్రంధాలయచైర్మన్ రఘువీర్ సింగ్, జెడ్ పిటిసి కందుల సంధ్యారాణి ముప్పై మంది తెలుగు కవులు కవయిత్రులు ఐదుగురు ఉర్దూ కవులు, కవయిత్రులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు .

# శ్రీధర్ బాబు గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలి

**కమాన్ పూర్**



రానున్న ఎన్నికల్లో మంథని నియోజక వర్గం నుండి శ్రీధర్ బాబును అధిక మెజార్టీతో గెలిపించాలని కమాన్ పూర్ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు కార్యకర్తలను కోరారు.ఏఐసీసీ సెక్రెటరీ మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమాన్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైనాల రాజు అద్వర్యములో గొల్లపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నుకోవడం జరిగిందిగొల్ల పల్లి గ్రామ శాఖ ఆధ్యక్షుడు బత్తుల అంజి ఉపాధ్యక్షులు కనుకుంట్ల సదయ్య , ప్రధాన కార్యదర్శి చెరగోండ రాజేశం ప్రచార కమిటి మేకల కుమార్ రైతు కన్వనర్ జరిగి ఓదేలు, బి.సి. సెల్ మేకల శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిగురు శ్రీనివాస్.కార్యదర్శి చలేంద్ర సతీష్ కుమార్ సంయుక్త కార్యదర్శ బత్తుల నర్సయ్య ను నియమించడం జరిగింది.. మరియు ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ సర్పంచ్ షీలారపు అనిత మల్లయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అన్వర్ కమాన్పూర్ మండలం మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రఫిక్ ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ మల్యాల తిరుపతి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అక్సర్ పెంచికల్పేట్ సీనియర్ నాయకులు చప్పరి శేఖర్ కమాన్పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంతం శ్రీనివాస్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ సతీష్ మామిడి రాజు బుర్ర సత్యం మరియు కమాన్పూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగపురి అజయ్ అదేవిధంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దుద్ధిల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# నేటి బాలలే రేపటి పౌరులు

## బాల కార్మికులను వినియోగిస్తే చర్యలు తప్పవు

**శ్రీకాకుళం**

నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి బాలలను కార్మికులుగా వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ యాజమాన్యాలను హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్.జి.ఓ హోమ్ వద్ద ర్యాలీ కార్యక్రమం కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై జెండా ఊపి ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. ఏడు రోడ్ల కూడలి వరకు సాగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నేడు నిర్వహించు కుంటు న్నామని, ఈ ర్యాలీ ఒక అవగాహన కార్యక్రమమని పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా బాల కార్మికులు తయారవుతున్నారని, అటువంటి బాలలను గుర్తించి పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, మధ్యలో బడి మానివేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నేటి నుండి పాఠశాలలు ప్రారంభమయ్యాయని, బడి మానివేసిన పిల్లలు కూడా హాజరయ్యేలా చూస్తున్నట్లు చెప్పారు. దసరా, సంక్రాంతి పండుగల సెలవుల సమయాల్లో కూడా కొంతమంది పిల్లలు బడి మానివేస్తుంటారని, అటువంటి వారిపై కూడా ప్రత్యేక శ్రద్ధను కనబరచి తిరిగి బడిలో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. బాలలు ఎట్టి పరిస్థితుల్లో చదువుమాని బయట ఉండకుండా, వారికి ఉజ్వల భవిష్యత్తు అందించే భాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇటువంటి తరుణంలో ప్రపంచ బాల కార్మిక దినోత్సవం నిర్వహించుకోవడం చాలా చాలా ముఖ్యమని వివరించారు. చట్టానికి వ్యతిరేకంగా బాలలని పనిలో చేర్పించు కున్నవారు న్యాయపరంగా శిక్షకు అర్హులని, కావున షాపులు, చిన్నతరహా పరిశ్రమలు, వివిధ సంస్థల యజమానులు బాల కార్మికులతో పనులు చేయించుకోరాదని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఉప కార్మిక కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాద రావు, సహాయ కార్మిక కమిషనర్ అజయ్ కార్తికేయ, సహాయ కార్మిక అధికారులు వై.శైలేష్ కుమార్, ఆర్.వి.వి. శ్రీనివాస రావు, వివిధ ప్రభుత్వ శాఖలు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశ్ జవదేకర్ దైవ భక్తి ఉన్న నేత

**చెప్పులేసుకుని ఆలయంలోకి వెళ్లేంత మూర్ఖుడు కాదు**

**73 ఏళ్ల వ్యక్తిపై ఇంత దుర్మార్గపు ప్రచారమా?**

**సాక్సులకు, చెప్పులకు తేడా తెలియని ఫాల్తుగాళ్లు చేస్తున్న దుష్ప్రచారమిది**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపాటు**

**కరీంనగర్**

కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పులేసుకుని వేములవాడ రాజన్న ఆలయంలోకి వెళ్లారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. 73 ఏళ్ల ప్రకాశ్ జవదేకర్ దైవ భక్తుడు. చెప్పులేసుకుని ఆలయంలోకి వెళ్లేంత మూర్ఖుడు కాదు...చెప్పులు విడిచి సాక్సులతో ఆలయంలోకి వెళ్లారు. నేను వారితోనే ఉన్నా."అని స్పష్టం చేశారు. సాక్సులకు, చెప్పులకు తేడా తెలియని ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అయ్యగారిని అడిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ఈరోజు కరీంనగర్ లో జరుగుతున్న స్మార్ట్ సిటీ పనులను పర్యవేక్షించడానికి ని టవర్ సర్కిల్ వద్దకు వచ్చిన బండి సంజయ్ వద్ద మీడియా ప్రతినిధులు ఈ అంశాన్న ప్రస్తావించగా పైవిధంగా బదులిచ్చారు. ప్రకాశ్ జవదేకర్ వయసు 73 ఏండ్ల పెద్దాయన. నడుస్తుంటే జారి కింద పడబోతే పట్టుకున్నా... దానిని కూడా ఫాల్తుగాళ్లు రాద్ధాంతం చేస్తారా? అంటూ మండిపడ్డారు.

మరోవైపు, కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పులేసుకుని వేములవాడ రాజన్న ఆలయంలోకి వచ్చారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని వేములవాడ రాజరాజేశ్వర ఆలయ పూజారులు ఖండించారు.

# పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టకపోతే ఉద్యమం ఉధృతం

**దేశవ్యాప్తంగా ధర్నాలు ? నిరసనలు**

**హైదరాబాద్**

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50% రిజర్వేషన్లు పెట్టాలని మరియు కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అలా లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేసి దేశ వ్యాప్తంగా ధర్నాలు ? నిరసనలు చేస్తామని రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఆదివారం గద్వాలకు చెందిన బి.సి నాయకులు బి.సి భావంలో కలిసి చర్చలు జరిపారు. కర్నాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, తమిళనాడు, అస్సాం, ఒరిస్సా తదితర రాష్ట్రాలలో పర్యటించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించింది. బీసీలు పార్టీలకతీతంగా బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. త్వరలోనే దేశవ్యాప్త పర్యటన చేస్తామని అన్నారు. ఈ చర్చలలో జోగులాంబ గద్వాల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేశ్, తుమ్మకుంట కె.కె, పెదొడ్డి రాజు, మహానంది తదితరులు పాల్గొన్నారు. కర్నాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, తమిళనాడు, అస్సాం, ఒరిసా తదితర రాష్ట్రాలలో పర్యటించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించారు. బీసీలు పార్టీలకతీతంగా బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. త్వరలోనే దేశవ్యాప్త పర్యటన చేస్తామని అన్నారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఈ దేశంలో గత 75 సంవత్సరాల గా పాలించిన కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాట్ ఇవ్వలేదు. ఉద్యోగ రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదు ఇది ప్రజాస్వామ్య దేశం ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇవ్వాలి కానీ 70 సంవత్సరాలు గడిచిన వాటా ఇవ్వడం లేదు. బి.సి లంటే ఉత్పత్తి కులాలు. దేశ సంపద సృష్టిస్తున్నారు. కాని సంపద అనుభవించే హక్కు లేదు. అవకాశం లేదు. పన్నులు కట్టే దేశ బడ్జెట్ ఇస్తున్నారు. కాని బడ్జెట్ లో కనీస వాటా లేదు. ఓట్లు వేసి అధికారం ఇస్తున్నారు. కాని అధికారులు బి.సి లకు వాటా ఇవ్వడం లేదు. ఈ దేశం లో బి.సిలకు ఇలా అన్యాయం జరుగుతుందన్నారు.

# రైతులను బెదిరించి వసూళ్లు

**13 మంది విలేకరులపై కేసు..**

**అనపర్తి**

పొలాలు బాగు చేసుకుంటున్నా రైతులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న 13 మంది పాత్రికేయులపై కేసు నమోదు చేసినట్లు అనపర్తి సిఐ విపత్తి శ్రీనివాస్ తెలిపారు ఆదివారం బిక్కవోలు పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పగలు ఎండ తీవ్రత వేడి గాలుల కారణంగా రాత్రి సమయంలో పొలాల్లోని ఎత్తు పల్లాలు సరిచేసుకుంటున్న రైతులను డబ్బులు ఇవ్వాలంటు డిమాండ్ చేయడమే కాకుండా వారిపై దౌర్జన్యం చేశారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. సుమారు 15 మంది వచ్చారని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని తమ ట్రాక్టర్లు, జెసిబి తాళాలు దౌర్జన్యంగా లాక్కోవడంతో ఘర్షణ జరిగిందనీ దీనితో వారి వెంట తెచ్చుకున్న బటన్ స్టిక్కుల్తో దాడికి ప్రయత్నించగా గ్రామస్థుల సహకారంతో వారిని ఎదుర్కోవడం జరిగిందన్నారు. గత ఏడాదికాలంగా విలేకరుల ముసుగులో కొంతమంది వ్యక్తులు మండలంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ డబ్బులు ఇవ్వని వారిపై ఇనుప రాడ్లు చూపించి భౌతికదాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన కర్రి రామకృష్ణారెడ్డి, మేడపాటి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, అమలాపురం జిల్లా రాయవరంకు చెందిన పాస్టర్ పలివెల ప్రసాద్, పందలపాకకు చెందిన రేపు సురేష్, బొమ్మ కంటి సుబ్బారావు, సొర్ల శ్రీనివాస్, పూలపల్లి కి చెందిన మద్దూరు వీరబాబు, కొమరిపాలెంకు చెందిన మల్లిడి వెంకట కృష్ణారెడ్డి, మెట్రో రాజశేఖర్ బలబద్రపురం గ్రామానికి చెందిన కొండేటి శ్రీమన్నారాయణ వ్యక్తులతో కలసి గత కొన్నేళ్లుగా మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో ఒక సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి మండల వ్యాప్తంగా దందాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ ముఠా బిక్కవోలులోనే కాకుండా పెదపూడి, రంగంపేట, రాయవరం మండలాల్లోనూ తమ దందాలను విస్తృతపరిచి అక్రమార్కుల వద్ద నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది చాలా అమాయక రైతుల్ని, వ్యాపారస్తులకు లక్ష్యంగా బెదిరింపులకు పాల్పడి డబ్బులు ఇవ్వని వారి పై పరుష పదాలతో దూషించడమే కాకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. వీరి భాధితులేవరైన ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని వారికి తగిన భద్రత కల్పించి చర్యలు తీసుకుం టామని సి ఐ తెలిపారు కార్యక్రమంలో ఎస్సై పి. బుజ్జిబాబు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు తాళం...

**హైదరాబాద్ :**

తెలంగాణలో అన్ని పాఠశాలలు వేసవి సెలవులు అనంతరము తిరిగి ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు అంతా బడిబాట పట్టారు. కానీ అందుకు భిన్నంగా కంటోన్మెంట్ తాడుబంద్ లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళం వేశారు. దీంతో విధులకు విచ్చేసిన ఉపాధ్యాయులు లోపలికి వెళ్లలేక గేటు ముందే పడిగాపులు కాశారు. చాలా సేపు చూసి చూసిన ఉపాధ్యాయులు.. ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హుటాహుటిన రంగంలోకి దిగిన మండల విద్యాధికారి విజయ్ కుమార్.. బడిని పరిశీలించారు. పాఠశాలకు తాళం ఎవరు వేశారని ఆరా తీశారు. స్థానికుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో.. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాల భవనానికి తాళం వేయడం చట్ట విరుద్ధమని అన్నారు. అయితే పాఠశాలకు తాళం ఎవరు వేశారో తెలుసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అదే విధంగా కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారుల, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.తెలంగాణలో 41 వేల స్కూళ్లు, గురుకులాలు, వసతిగృహాలు తెరుచుకున్నాయి. దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది స్కూల్కు వెళ్లనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలతో పటిష్టమైన ప్రణాళికను రూపొందించారు. తెలంగాణలో పాఠశలల సెలవులు పొడిగించారని వస్తున్న వార్తలపై విద్యాశాఖ స్పందించింది. విద్యాశాఖ సెక్రటరీ మాట్లాడుతూ... వేసవి సెలవులను 19 వరకు పొడిగించారని ఫేక్ న్యూస్ తమ దృష్టికి వచ్చిందన్నారు. అది నిజం కాదన్నారు. సెలవులను పొడిగించలేదని తేల్చి చెప్పారు. సోషల్మీడియాలో ఫేక్ సర్క్యులర్ వైరల్ అవుతోందని క్లారిటీ ఇచ్చారు. గతేడాది 1-8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టిన సర్కారు ఈసారి దాన్ని 9వ తరగతికి విస్తరించనుంది. అంతేకాకుండా విద్యార్థులపై చదువు భారం లేకుండా మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ప్రతి మూడో శనివారం నో బ్యాగ్ డే నిర్వహిస్తారు. ఆ రోజు ఎలాంటి చదువుల ఒత్తిడి లేకుండా ఆటలు ఆడిపిస్తారు. సిలబస్లో లేని అంశాలు, విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని కలిగించే కార్యక్రమాలు చేపడతారు. ఆధునిక సాంకేతికతపై? జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ నిర్వహిస్తారు. విద్యార్థులకు టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) అందిస్తారు. ఈ సంవత్సరం కూడా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలు చేస్తారు. ఆధునిక ప్రపంచంతో పోటీ పడేలా చేపట్టాల్సిన కార్యక్రమాలతో ప్రత్యేక మాడ్యూల్ను తయారు చేసి ఆయా స్కూల్స్కు పంపించారు. తెలంగాణలోని 19,800 టీచర్లకు ట్యాబ్లు అందజేయనున్నారు. 2,265 జిల్లా పరిషత్ స్కూళ్లు, 467 మండల వనరుల కేంద్రాల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ల్యాబ్స్ను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ పంపిణీ చేస్తారు.

# భజరంగ్ బలి అండతో గెలుపు మాదే

**భోపాల్:**

హిమాచల్,కర్నాటక ఎన్నికల్లో విజయం తరువాత మిషన్ మధ్యప్రదేశ్ను ప్రారంభించారు ప్రియాంకా గాంధీ. మధ్యప్రదేశ్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బీజేపీ హిందుత్వకు కౌంటర్గా హిందుత్వ సిద్ధాంతానే ప్రయోగిస్తున్నారు ప్రియాంక. బజరంగ్బలి అండతో ఎన్నికల్లో గెలుస్తామంటున్నారు కాంగ్రెస్ నేతలు. జబల్పూర్లో జరిగిన సభలో పాల్గొన్నారు ప్రియాంక. హనుమంతుడి గదలతో బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రియాంకాగాంధీకి ప్రత్యేక రీతిలో స్వాగతం పలికారు కార్యకర్తలు. జబల్పూర్లో నర్మదానదికి హారతికి హాజరయ్యారు ప్రియాంకాగాంధీ. మతకలహాలు సృష్టించి బీజేపీ ఎన్నికల్లో విజయం సాధిస్తోందని ఆరోపించారు. మతరాజకీయాలకు మధ్యప్రదేశ్ అడ్డాగా మారిందని మండిపడ్డారు.ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. పలు హిందూ సంఘాలు కాంగ్రెస్కు మద్దతు ప్రకటించాయి. మాజీ సీఎం కమల్నాథ్ సమక్షంలో భారీ సంఖ్యలో బజరంగ్ సేన కార్యకర్తలు కాంగ్రెస్లో చేరారు. అయితే ప్రియాంక మధ్యప్రదేశ్ పర్యటనపై మండిపడుతున్నారు బీజేపీ నేతలు . ఎన్నికలు ఉన్నప్పుడే ప్రియాంకకు పూజలు గుర్తుకు వస్తాయన్నారు. హిమాచల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికి నెరవేర్చలేదన్నారు.ఇదిలావుంటే, కాంగ్రెస్లో ప్రియాంక గాంధీ స్థాయి మరింత పెరగనుంది. ప్రియాంక గాంధీ ఇకపై యూపీకి మాత్రమే ఇన్ఛార్జ్గా కాకుండా ఆమెను కేంద్ర బృందంలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. ప్రియాంక గాంధీని వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా జాతీయ ఉపాధ్యక్షులుగా చేయవచ్చని తెలుస్తోంది. యూపీ బాధ్యతలు చేపట్టేందుకు కొత్త నేత కోసం కాంగ్రెస్ వెతుకుతోంది.ఈ ఏడాది



జరగనున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రియాంక గాంధీ ధీమాగా ఉన్న తరుణంలో ఈ వార్త చక్కర్లు కొడుతోంది. ప్రియాంక గాంధీ సోమవారం ఎంపీ పర్యటనలో ఉన్నారు. జబల్పూర్లోని నర్మదా తీరంలో పూజలు చేశారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రచారం కూడా మొదలైంది. ఎంపీలో జరిగే ర్యాలీలో ప్రియాంక ప్రసంగిం చనున్నారు.

# గుండేటి రాజు కు కళా విశిష్ట పురస్కారం

**జగిత్యాల**

జగిత్యాలకు చెందిన కళాకారుడు కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ అధినేత గుండేటి రాజు కు ప్రభుత్వం తరుపున పురస్కారం ఆందుకున్నారు.తెలంగాణ దశాబ్ది ఉత్సావాల సందర్భంగా నిర్వహించిన తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాలకు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక అదినేత గుండేటి రాజు ను కళా విశిష్ట పురస్కారంతో జిల్లా కలెక్టర్ షేక్ యాష్మిన్ భాషా,జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లు సన్మానించారు.జిల్లా గ్రంధాలయం చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, డిసిఏంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.గుండేటి రాజుకు పురస్కారం రావడం పట్ల జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, అలిశెట్టి రాజు, కందుకూరి నాగరాజు, బూశారపు శ్రీనివాస్ గౌడ్,సంకోజి వెంకట రమణ, దండే గోవర్దన్, గాజుల నగేష్, అభి, మిష్టర్ తెలంగాణ షావేర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# రెండు మూడు రోజుల్లో ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం

**హైదరాబాద్ :**

రెండు మూడు రోజుల్లో ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలోకి వచ్చే రెండ్రోజుల్లో (మంగళ లేదా బుధవారాల్లో) నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రుతుపవనాల ప్రవేశం తర్వాతే రాష్ట్రమంతా విస్తరించేందుకు ఎన్ని రోజులు పడుతుందో చెప్పగలమని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, కర్నాటకలోని మరికొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయని వివరించారు. అయితే సోమవారం కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వానలు పడటంతో కొంత వాతావరణం చల్లబడింది. పెద్దపల్లి జిల్లా ఈసాలతక్కెళ్లపల్లిలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కరీంనగర్ జిల్లా తనుగులలో 44.3, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 44.2, పెద్దపల్లి జిల్లా పాలితంలో 44.1, అదే జిల్లా ముత్తారం, ఆసిఫాబాద్ జిల్లా జంబుగలో 43.8, పెద్దపల్లి జిల్లా కునారం, ఆసిఫాబాద్ జిల్లా కుంచవెల్లిలో 43.5 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. వడదెబ్బతో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గొడిశాలకు చెందిన చిట్యాల రాజకొమురయ్య (81) మృతి చెందాడు. ఇక కాసిపేట, మందమర్రి, గుండాల, దండేపల్లి, ఆత్మకూరు, మూటకొండూరు, గండీడ్ మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు, స్తంభాలు కూలిపోయాయి. దండేపల్లి మండలం వెల్గనూరుకు చెందిన కడుతల గురువయ్య (73), గండీడ్ మండలం పెద్దవార్వల్‌కు చెందిన కటికె బాలరాజు (50), అతడి 30 మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయి.

# అడవిలో 40 రోజుల జీవితం

**తొలిసారి నోరువిప్పిన ఆ నలుగురు పిల్లలు..**

**న్యూఢిల్లీ :**





అమెజాన్ అడవిలో విమానం కూలిపోవడంతో తల్లిని కోల్పోయిన నలుగురు బాలలు 40 రోజులపాటు అష్టకష్టాలు అనుభవించారు. వీరిలో పెద్ద అమ్మాయి తన తోబుట్టువులు ముగ్గురిని చాలా చాకచక్యంగా వ్యవహరించి కాపాడింది. వీరిని కాపాడిన సహాయక బృందంతో వీరు మాట్లాడిన మొదటి మాటలు అందరికీ తీవ్ర ఆవేదనను కలిగిస్తాయి. "నాకు ఆకలేస్తోంది", "మా అమ్మ చనిపోయింది" అని వారు దీనంగా చెప్పడంతో, వారిని కాపాడినవారు వారిని అనునయిస్తూ, "మేము మీ స్నేహితులం" అని చెప్పి సముదాయించారు.

అమెజాన్ ఏరియాలోని అరరక్యూరా నుంచి 350 కిలోమీటర్ల దూరంలోని శాన్ జోస్ డెల్ గ్వావియారే పట్టణానికి మే 1న బయల్దేరిన సెస్నా 206 విమానం కొద్ది సేపటికే కుప్పకూలిపోయింది. దీనిలో పదమూడేళ్లు, తొమ్మిదేళ్లు, ఐదేళ్లు, ఒక ఏడాది వయసుగల నలుగురు పిల్లలతో ఓ తల్లి, పైలట్, మరొకరు ప్రయాణించారు. వీరిలో ఈ నలుగురు పిల్లలు మినహా మిగిలిన ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

40 రోజులపాటు విస్తృత గాలింపు తర్వాత నలుగురు పిల్లలను కాపాడిన రెస్క్యూ బృందంతోనూ, స్థానికులతోనూ ఓ టీవీ చానల్ మాట్లాడింది. ఈ నలుగురు పిల్లల్లో పెద్దమ్మాయి లెస్లీ వయసు 13 ఏళ్లు. ఆమె ఒక ఏడాది వయసుగల తన తమ్ముడిని చంకలో ఎత్తుకుని పరుగులు తీస్తూ తన వద్దకు వచ్చిందని సహాయక బృందంలోని సభ్యుడు నికోలాస్ ఒర్డోనెజ్ గోమ్స్ చెప్పారు. లెస్లీ మొట్టమొదటి మాటలు "నాకు ఆకలేస్తోంది" అని చెప్పారు. ఇద్దరు మగ పిల్లల్లో ఒకరు క్రింద పడుకుని ఉన్నాడని, తాము అక్కడికి వెళ్లటాన్ని గమనించి, లేచి కూర్చుని, "మా అమ్మ చనిపోయింది" అని చెప్పాడని తెలిపారు.

తాము వెంటనే వారిని సముదాయించామని, "మేం మీ స్నేహితులం, మమ్మల్ని మీ కుటుంబ సభ్యులు పంపించారు. మీ నాన్న, మీ అంకుల్ పంపించారు" అని చెప్పామన్నారు.

ఈ పిల్లల తండ్రి మాన్యుయెల్ మిల్లర్ రనోక్ విలేకర్లతో మాట్లాడుతూ, విమాన ప్రమాదంలో తన భార్య మగ్దలీనా ముకుటుయ్ తీవ్రంగా గాయపడిందని, ఆమె నాలుగు రోజుల వరకు సజీవంగానే ఉందని చెప్పారు. ఆ సమయంలో తమ పిల్లలు ఆమె వద్దనే ఉన్నారన్నారు. ఈ విషయాన్ని లెస్లీ తనకు చెప్పిందన్నారు. ఆమె చనిపోయే ముందు పిల్లలతో మాట్లాడుతూ, "మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి. మీ నాన్న గారిని కలుసుకోండి. ఆయన నాలాగే మిమ్మల్ని ప్రేమగా చూసుకుంటారు" అని చెప్పిందని తెలిపారు. అడవిలోని చెట్ల వేర్లు, పండ్లు, మొక్కలను తింటూ ప్రాణాలను కాపాడుకున్నట్లు లెస్లీ చెప్పిందని తెలిపారు. ఈ నలుగురు పిల్లలకు కొలంబియా రాజధాని నగరం బొగోటాలోని సైనిక ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వీరు ప్రస్తుతం కోలుకుంటున్నారు.

## కుసుమ జగదీశ్వర్ అంత్యక్రియలలో పాల్గొన్న మంత్రి కేటీఆర్

**ములుగు**

ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ ఆదివారం అకాల మరణం చెందగా ఆయన స్వగ్రామం ములుగు మండలం మల్లంపల్లిలో నిర్వహించే అంత్యక్రియలలో పాల్గొని అతని కుటుంబాని కి అండగా ఉంటారని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. జగదీశ్ భార్య పిల్లలకి పార్టీ ఎపుడు అండగా ఉంటారని మంత్రి కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ నుండి కెసిఆర్ ఆదేశాల మేరకే ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు



ఉద్యమ నాయకుడు జగదీశ్. జగదీశ్ ఉద్యమలో రాజకీయాల్లో పేరు సంపాదించుకున్నడు తప్ప ఆస్తులు సంపాదించుకోలేదని అయన అన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఉత్సాహంగా 2కే రన్

**హైదరాబాద్:**

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ 2కే రన్ ను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సాహంగా రన్ కొనసాగింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్ లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి మహమూబ్ అలీ 2కే రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, క్రీడాకారులు నిఖత్ జరీన్, ఈషా సింగ్, గాయకులు మంగ్లీ, రామ్ మిర్యాల, సినీ నటి శ్రీలీల పాల్గొన్నారు. నాలుగు వేలకుపైనా జనాలు ఈ రన్ లో పాల్గొన్నారు. ఈ తెలంగాణా రన్ ప్రారంభోత్సవానికి ముందు ప్రముఖ గాయకులు మంగ్లీ, రామ్ లు ఆలపించిన తెలంగాణా పాటలు హాజరైన యువతీ, యువకులను పెద్ద ఎత్తున ఆకట్టు కున్నాయి. దాదాపు 4 వేలకు పైగా రన్నర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించేలా బోనాలు, బతుకమ్మలతో సహా పోలీస్ అశ్విక దళం, డప్పులు, ఇతర నృత్యాలతో హోరెత్తించారు. 2ఐ, 5ఐ తెలంగాణా రన్ లను రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ లు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రసంగించారు.

**దేశంలోనే నెంబర్ వన్ సీఎం కేసీఆర్: మంత్రి మహమూద్ అలీ**

రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో శరవేగంగా పురోగమనానికి ప్రధాన కారణమైన రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ సీఎం అని ప్రశంసించారు. మరే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధితో తెలంగాణా రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు.

తెలంగాణా కు మంచి కీర్తి, ప్రతిష్టలు తేవాలి: మంత్రి శ్రీనివాస్ గౌడ్

ఐటీ పారిశ్రామిక రంగాల్లో తెలంగాణా రాష్ట్రంతో మరే రాష్ట్రం పోటీ పడదం లేదని, ఇదే విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో యువత బాగస్వామ్యం వహించాలని రాష్ట్ర యువజన, సాంస్కృతిక శాఖ మంత్రి వీ. శ్రీనివాస గౌడ్ పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను అంత్యంత సమర్ధవంతంగా అమలు చేస్తూ తెలంగాణా రాష్ట్రానికే తెలంగాణా ఆదర్శనంగా నిలిచిందని అన్నారు. మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహ స్ఫూర్తిగా తెలంగాణా రన్ ను నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అప్రతిహాత అభివృద్ధిని మరోసారి ప్రజలకు వివరించేందుకు దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణా రాష్ట్రం సురక్షిత నగరంతోపాటు ఆరోగ్యవంతమైన రాష్ట్రమని అన్నారు. వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే మేటిగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారిణి ఈషా సింగ్, సినీ నటి శ్రీలీలలు కూడా పాల్గొని మాట్లాడారు. అలాగే జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, ఐజీ రమేష్ రెడ్డిలతో సహా పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా

అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రన్ ను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్ తెలంగాణ రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కలెక్టర్ అమయ్ కుమార్, రాచకొండ సీపీ చౌహాన్ పాల్గొన్నారు. అంతేకాకుండా వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రన్ ను మంత్రి నిరంజన్ రెడ్డి, రంగారెడ్డిలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్, నల్లగొండ పట్టణంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డిలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి ఖిల్లాపై తిరంగా యాత్ర నిర్వహించారు. కోట వద్ద జాతీయ జెండా ఎగురవేశారు.

## మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ నుగృహనిర్బంధం

**గద్వాల**

జు సీఎం కేసీఆర్ గద్వాల పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులను కుల సంఘాల నాయకులను అరెస్టు చేసి నిర్బంధించడం నీతిమాలిన చర్య అని మండిపడ్డారు. ఎన్నో పోరాట ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు నిరుద్యోగులకు న్యాయం చేయలేక ప్రశ్నించే వారిని అరెస్టు చేసి నిర్బంధించడం సిగ్గుచేటు. అలంపూర్ కు రెండుసార్లు పర్యటించి సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చక జాప్యం చేస్తూ వాటిని అమలు చేయమని ప్రశ్నించినందుకు నిర్బంధిస్తున్నారు. గద్వాల జిల్లాలో సీఎం ఇచ్చిన హామిలు అలంపూర్ నియోజకవర్గం రైతులకు వెన్నెముకైనాతుమ్మిళ్ల లిఫ్ట్ రిజర్వాయర్లు మరిచారు. కంగ్రెస్ హాయంలో మొదలుపెట్టిన నెట్టెంపాడు



టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అల్లంపూర్ నియోజకవర్గం లో ఉన్నటువంటి ఏ కాలువలో కూడా మట్టి తీసి పొలాలకు నీళ్లు తీసుకుని ప్రయత్నం గాని ఈ టీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదు. అల్లంపూర్ కు డిగ్రీ కాలేజ్ లేదు. మినీ బస్సు డిపోలేదు. ఫైర్ స్టేషన్ లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే నియోజకవర్గం లో అభివృద్ధి కుంటూబడి ఉంది. రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని కాంగ్రెస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నామని అన్నారు.

## పానకాల చెరువు రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన

**కృష్ణాజిల్లా**

కృష్ణాజిల్లా గన్నవరంలో పానకాల చెరువు రిజర్వాయర్ పనులకు ఈరోజు శంకుస్థాపన జరిగింది. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే గన్నవరం ప్రాంత ప్రజల మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందని స్థానిక శాసనసభ్యులు వల్లభనేని వంశీ అన్నారు. గన్నవరం ప్రాంత ప్రజలు దీర్ఘకాలంగా మంచినీటి సమస్యతో బాధపడుతున్నారు. స్థానికంగా రిజర్వాయర్ లేకపోవడంతో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించవలసిందిగా అనేక మంది ప్రజాప్రతినిధులను వారు కలిసి విన్నవించుకున్నారు. అయినప్పటికీ వారి సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్య గుర్తించిన శాసనసభ్యులు వల్లభనేని వంశీ పానకాల చెరువు రిజర్వాయర్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్ పనులకు సంబంధించిన నిధులను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. పానకాల చెరువు రిజర్వాయర్ ద్వారా గన్నవరం ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుంది అని సందర్భంగా వంశీ ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువు పూడిక తీసిన మట్టిని గన్నవరం నియోజక వర్గంలోని జగనన్న లేఔట్ లకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం అని తెలిపారు. పేద ప్రజలకు ఉచితంగా సెంటు భూమిని ప్రభుత్వం కేటాయిస్తే హర్షించాల్సిన ప్రతిపక్ష పార్టీ నేతలు ఆ స్థలాలను స్మశానంగా పోల్చటం సిగ్గుచేటని పార్టీలకతీతంగా అభివృద్ధిని అభినందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వంశీ పేర్కొన్నారు.

## వారాహి యాత్రను ఎవరు ఆపలేరు

**టెక్కలి**

వారాహి యాత్రను ఎవరు ఆపలేరని జనసేన టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ కణితి కిరణ్ అన్నారు. ఈ సదర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి చేపట్టబోయే వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రజల వద్ద నుంచి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్లడానికి ఉపయోగపతయాన్నారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు లేని రైతు రాజ్యం స్థాపించడానికి, భవన కార్మికులకు భరోసా కల్పించడానికి జనసేన ఉపయోగపడుతుందన్నారు. నిరుద్యోగులకు వడ్డీ లేని రుణాలను అందించి వారి ద్వారా నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి గా చేయడానికి జనసైనికులు ముందుకు రావాలన్నారు.

# జుకర్‌బర్గ్‌కు షాక్ ఇచ్చిన ఉద్యోగులు


**న్యూయార్క్:**

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ల పేరెంట్ కంపెనీ మెటా ఉద్యోగులు, ఆ కంపెనీ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు మైండ్ బ్లాంక్ అయ్యే షాక్ ఇచ్చారు. ఆ దెబ్బకు, అసలే తెల్లగా ఉండే బాస్ ఫేస్ మరింత పాలిపోయి ఉండవచ్చు. కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, ఈ ఏడాదిని 'ఇయర్ ఆఫ్ ఎఫీషియన్సీ'గా జుకర్‌బర్గ్ ప్రకటించారు. అందులో భాగంగా, ఇటీవలి కాలంలో కొన్ని అనూహ్య నిర్ణయాలు తీసుకున్నారు. కొందరు ఉద్యోగులను సంస్థ నుంచి తప్పించారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా, గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి చాలా సుప్రసిద్ధ టెక్ కంపెనీలు దశల వారీగా తమ సిబ్బందిని తొలగిస్తూ వచ్చాయి. ఇందులో మెటా పేరు కూడా ఉంది. ఖర్చులను తగ్గించుకోవడానికి మెటా కూడా వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గత ఏడాది నవంబర్‌లో, కంపెనీ వర్క్‌ఫోర్స్‌లో 13 శాతం లేదా 11 వేల ఉద్యోగాలకు కోత పెట్టిన జుకర్‌బర్గ్, ఈ ఏడాది మార్చిలో మరో 10 వేల మందిని ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో, కంపెనీలో అంతర్గతంగా ఒక సర్వే జరిగింది. జుకర్‌బర్గ్ గురించి సిబ్బంది ఏమనుకుంటున్నారు, కంపెనీని నడిపే సత్తా ఆయనకు ఉందా, జకర్‌బర్గ్ నాయకత్వం మీద నమ్మకం ఉందా వంటి ప్రశ్నలను ఆ సర్వేలో అడిగారు. ఆ ప్రశ్నలకు ఎవరూ ఊహించని సమాధానాలు చెప్పారు మెటా ఉద్యోగులు. వాల్ స్ట్రీట్ జనరల్‌లో ప్రచురించిన నివేదిక ప్రకారం, మెటా సిబ్బందిలో ముప్పావు శాతం మందికి జుకర్‌బర్గ్ నాయకత్వం మీద నమ్మకం లేదు. కేవలం 26 శాతం మంది మాత్రమే జుకర్‌బర్గ్ లీడర్‌షిప్ మీద విశ్వాసంతో ఉన్నారు. చివరి రౌండ్ లేఆఫ్‌లకు ముందు, ఈ ఏడాది ఏప్రిల్ 26 - మే 10వ తేదీల మధ్య ఈ సర్వేను నిర్వహించారు. అంతకుముందు, 2022 అక్టోబర్‌లో నిర్వహించిన సర్వేలో, జుకర్‌బర్గ్‌ను నమ్మిన వాళ్లు దాదాపు 31 శాతంగా ఉన్నారు. తాజాగా, మరో 5 శాతం మంది నమ్మకాన్ని కంపెనీ అఖా కోల్పోయారు.

74 శాతం మంది ఉద్యోగుల్లో ఎందుకు అసంతృప్తిగా ఉన్నారు?

కంపెనీ తొలగించిన వేల మందిలో ఎక్కువ శాతం సిబ్బంది పని దొంగలు కాదు, సమర్థులు అన్నది ఉద్యోగుల మాట. అయినా, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా వాళ్లకు పింక్ స్లిప్స్ వెళ్లాయి. దీంతో, పని చేసే వాళ్లను కూడా తీసేయడమేంటని ఉద్యోగుల్లో అసంతృప్తి పెరిగింది. ఫలితంగా, టాప్ మేనేజ్‌మెంట్ నమ్మకం పోవడమే కాదు, మిగిలిన ఉద్యోగుల్లో అభద్రత భావం, మానసిక ఒత్తిడి పెరిగిందని తాజా నివేదిక వెల్లడించింది. ఈ తొలగింపుల కారణంగానే కంపెనీలోని 74 శాతం మంది ఉద్యోగులు జుకర్‌బర్గ్ నాయకత్వం పట్ల సంతోషంగా లేరని అంతర్గత సర్వే ద్వారా స్పష్టమైంది. అయితే.. మెటా ఉద్యోగుల్లో 43 శాతం మంది తమ పనికి విలువ ఉందని భావిస్తున్నారట.












Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950